ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

శనివారం 14 డిసెంబరు 2024



● గ్రీన్‌ఫీల్డ్ హైవే నమూనా

నత్తే.. నయం..!

కడప-రేణిగుంట 716 గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు నత్తే నయంగా సాగుతున్నాయి. రెండేళ్ల కిందట ఈ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టినా పనులు మాత్రం ఎందుకనో ప్రారంభం కాలేదు. సుమారు 123 కి.మీ. మేర నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో మొదటి విడతగా 64 కి.మీ. గానూ రూ.1500 కోట్లకు పైగా పనులకు టెండర్లు పిలిచారు. భూసేకరణ బాధితులకు నష్టపరిహారమూ చెల్లించారు. ఇంతలో ఏమైందో.. ఎక్కడి పనులు అక్కడే నిలిపేశారు. మరి ఇది పాలకుల వైఫల్యమా..? కమీషన్ల లొల్లా..? అనేది తెలియాల్సి ఉంది.

● గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ప్రారంభం ఎప్పుడో ?
● కడప-రేణిగుంట రోడ్డు పనులు జరిగేనా ?
● పనులకు టెండర్లు పూర్తి
● భూసేకరణ బాధితులకు నష్టపరిహారమూ చెల్లింపు
● పనుల ఆలస్యమెందుకో..?

రాజంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర వాసులు తిరుమలకు వెళ్లేందుకు ఎంతో ఉపకరించే ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభం ఎప్పుడా.. అని పలువురు ఎదురు చూస్తున్నారు. ఈ హైవే పనులకు 2022లో కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా.. గత పాలకుల వైఫల్యం కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు పనులకు ఎన్‌హెచ్‌ఏఐ శ్రీకారం చుట్టి టెండర్లు కూడా పిలిచి పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టింది. సుమారు 123 కి.మీ. మేర నాలుగు వరుసల నిర్మాణానికి రూ.2254 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మొదటి ప్యాకేజీగా 64 కి.మీ.కు టెండర్లు కూడా పిలిచారు. కడప నుంచి చిన్న ఓరంపాడు వరకు మొదటి రీచ్ కింద ప్రారంభించి ఈ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ. 1500 కోట్లకు టెండర్లు కూడా పిలిచి పనులకు శ్రీకారం చుట్టినా ఎందుకనో పనులు మాత్రం పూర్తి కాలేదు. భూసేకరణ పూర్తి చేసి బాధితులకు మొత్తం చెల్లించి నిర్మించాల్సిన రోడ్డుకు కంపచెట్లను కూడా తొలగించి అన్ని సర్వేలు పూర్తయి పనులు ప్రారంభమయ్యే సమయంలో ఏ కారణం చేతనో పనులు నిలిపివేశారు. ఇదంతా గత వైసీపీ పాలనలో జరిగింది. ఇది గత పాలకుల వైఫల్యమా.. లేక కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల పంచాయితీనా ? అని పలువురు చర్చించుకుంటున్నారు.

కడప నుంచి చిన్నఓరంపాడు వరకు మొదటి ప్యాకేజీ పనులకు ఒక చిన్నపాటి జంగిల్ క్లియరెన్స్ తప్ప ఇక ఎటువంటి అవరోధాలు లేవు. రెండో ప్యాకేజీ కింద చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు నిర్మించాల్సిన రోడ్డు మార్గంలో శేషాచలం అడవిలో ఉన్నందున బాలుపల్లె నుంచి జంగిల్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. రెండేళ్లుగా జంగిల్ క్లియరెన్స్ వచ్చి ఉండాలి. దీన్ని పర్యవేక్షణ చేసే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కూడా ఎవరికీ అందుబాటులో ఉండడం లేదు. ఇందుకు సంబంధించిన కార్యాలయం తిరుపతిలో ఉన్నట్లు తెలిసి సంబంధిత పర్యవేక్షణ అధికారులకు ఫోన్లు చేస్తున్నా పట్టించుకొనే వారు లేరు. జంగిల్ క్లియరెన్స్ రాలేదని ఒక కారణం, నాలుగు వరుసల నుంచి ఆరు వరుసల రోడ్డుగా మారుస్తారన్నది మరో కారణంగా చెబుతున్నారు. ఇదేకాక గతంలో ఈ రోడ్డు పనులు నిర్వహించే కాంట్రాక్టర్ నుంచి గతంలో వైసీపీ పెద్దలు పెద్దఎత్తున ముడుపులు చెల్లించాలని ఒత్తిడి చేయడంతోనే పనులు చేయడానికి కాంట్రాక్టర్ వెనక్కు తగ్గారని మరో కారణం చెబుతున్నా.. ఎవరూ దీని గురించి నోరు విప్పే పరిస్థితి లేదు.



రెండేళ్ల కిందట గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం ఎక్స్‌కవేటర్లతో ప్రారంభించిన పనులు



కోడూరు వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే అటవీ ప్రాంతం



పూర్తిగా గుంతలమయమై వాహనాలు వెళ్లలేని స్థితిలో రాజంపేట డబుల్‌లైను రోడ్డు

ఇప్పటికే కడప-రేణిగుంట మధ్య డబల్ రోడ్డులో వేలాది వాహనాలు తిరుగుతున్నాయి. ఈ రోడ్డులో అందునా ప్రస్తుత వర్షాకాలంలో అడుగడుగునా గుంతలు పడి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేక అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో ప్రతిరోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూ ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కిందట పనులు ప్రారంభమై ఉంటే ఈపాటికి ఒక దశకు చేరుకునేవి. వచ్చే రెండేళ్లలో ఈ మొత్తం రోడ్డు పూర్తయి ఇటు రాయలసీమ జిల్లా వాసులతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల వాసులకు ప్రయాణం సులభతరం అయ్యేది. రోడ్డు పూర్తయితే కడప నుంచి రేణిగుంటకు నాలుగు గంటల్లో వెళ్లే వ్యవధి కేవలం 2 గంటలకే తగ్గిపోతుంది.

ప్రారంభించిన రెండేళ్లలోపే పూర్తి కావాల్సిన ఈ రోడ్డు నిర్మాణం పనులు రెండేళ్లుగా ప్రారంభ దశలోనే ఉండడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో అన్నిచోట్ల కొత్త హైవేల నిర్మాణం యుద్ధప్రాతిపదికన జరుగుతుంటే ఇక్కడ ఆరంభ దశలోనే పెండింగ్‌లో పడడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ పాలకులు ఈ రోడ్డు పనుల వ్యవహారం పై అలసత్వం చూపడం, కాంట్రాక్టర్లను ముడుపుల కోసం బెదిరించడం ఒక అంశమైతే రెండోదశలో ప్రారంభించిన చిన్నఓరంపాడు-రేణిగుంట పనులకు జంగిల్ క్లియరెన్స్ కూడా మరో కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా ఈ ప్రాంత పాలకులు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి వెంటనే గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను ప్రారంభించే దిశగా ఒత్తిడి తేవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత పర్యవేక్షణ అధికారులకు వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఎన్నిమార్లు ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదు.

రెండేళ్లుగా పనులు పెండింగ్‌లో ఉండడం దారుణం..



రెండేళ్లుగా కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు పెండింగ్‌లో ఉండడం బాధాకరం. గత వైసీపీ పాలకుల అలసత్వం వల్లే ఈ హైవే పనులు నిలిచిపోయాయి. సుమారు 123 కి.మీ. నిడివిలో ఏర్పాటు చేసే ఈ పనులను సత్వరం ప్రారంభించకపోతే ఈ ప్రాంతంలో పెద్ద ఉద్యమమే నిర్వహించాల్సి వస్తుంది.

- నాగా సుధాకర్‌రెడ్డి, న్యాయవాది

ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు..



కడప-రేణిగుంట మధ్య ప్రస్తుతం ఉన్న రెండు లేన్ల రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ రోడ్డు దెబ్బతినడం, నిత్యం వేలాది వాహనాలు వెళ్తుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వెంటనే నాలుగు లేన్ల రహదారి పనులు చేపట్టాలి.

- డాక్టర్ దగ్గుపాటి నవీన్, రాజంపేట

పనులు ఎప్పుడో పూర్తయ్యేవి..



రెండేళ్ల కిందట టెండర్లు పూర్తి చేసుకుని రోడ్డు పనులు ప్రారంభించి ఉంటే ఈ సమయానికి పనులు ఎప్పుడో పూర్తయి ఉండేవి. నాలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు రాయలసీమ ప్రజలకు ఈ ప్రయాణం సులభతరమయ్యేది. రోడ్డు ప్రమాదాల్లో ఎందరో బలైపోతున్నారు. పనులు ప్రారంభం కాకుండా ఎందుకు నిలిపివేశారో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా పనులను ప్రారంభించాలి.

- షేక్ షామీర్‌బాషా, రాజంపేట

బంగారు భవిష్యత్తుకు కృషి చేయాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్య సాధనలో భాగస్వాములై స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తుకు కలిసికట్టుగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. శుక్రవారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో సీఎం చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ హాలులో వర్చువల్‌గా ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ వీక్షించారు. అనంతరం సిబ్బందితో జేసీ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్‌లో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికి నీటి భద్రత, రైతు- వ్యవసాయ సాంకేతికత, ప్రపంచ స్థాయి పంపిణీ వ్యవస్థ, శక్తి ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాల్లో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వర్ణాంధ్ర, తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఆయా అంశాల్లో పరిపూర్ణమైన అభివృద్ధిని సాధించి అన్నమయ్య జిల్లా స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తుకు కృషి చేద్దామని జేసీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్ ప్రోగ్రాంకు హాజరైన జాయింట్ కలెక్టర్

పథకం ప్రకారమే హత్య

● రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు ● పోలీసుల అదుపులో నిందితులు

ఓబులవారిపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మంగంపేట హత్య కేసు నిందితులను ఎట్టకేలకు శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పథకం ప్రకారమే హత్య చేసినట్లు రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని మంగంపేటలో నివాసముంటున్న గట్టు అంజనేయులు(59)ను ఈ నెల 6న గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు మృతుడి కుమారుడు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు.

మండలానికి చెందిన ఓ వ్యక్తి బతుకుదెరువు నిమిత్తం కొంతకాలం క్రితం తన భార్యతో కలిసి కువైత్‌కు వెళ్లాడు. తన 12 ఏళ్ల బాలిక బాగోగులు చూడమని తన భార్య అమ్మగారి వద్ద ఉంచాడు. ఇదిలా ఉండగా ఈ మధ్యే తన అత్తగారు కూడా కువైత్‌కు వెళ్తూ బాలికను ఆమె చిన్న కుమార్తె (మరదలి) వద్ద ఉంచింది. కాగా ఈ విషయం తన మరదలికి నచ్చేది కాదు. వీరికి తన మరదలి కుటుంబానికి ముందు నుంచే మనస్పర్థలు ఉండేవి. కాగా బాలిక హాస్టల్లో ఉంటూ అప్పుడప్పుడు పిన్ని ఇంటికి వచ్చి వెళ్లేది. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం ఇంటికి వచ్చిన బాలిక పట్ల వరుసకు తాత అయిన పిన్ని మామ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక ఫోన్‌లో తన తల్లికి చెప్పగా ఆందోళన చెందిన ఆమె కువైత్ నుంచి మంగంపేటకు వచ్చి నవంబరు 21న ఓబులవారిపల్లె పోలీసులకు తెలిపింది. దీంతో పోలీసులు ఆ వృద్ధుడిని పిలిపించి మందలించి పంపించివేశారు. అంతేకానీ బాలిక తల్లి కేసు నమోదు చేయాలని రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని సీఐ తెలిపారు. ఆ వెంటనే బాలిక తల్లి కువైత్‌కు వెళ్లి అక్కడున్న తన భర్తతో జరిగిన విషయాన్ని తెలిపి, తన చెల్లి మామను చంపాలని కోరింది. దీంతో బాలిక తండ్రి పథకం ప్రకారం హత్యకు కుట్రపన్నాడు. వెంటనే మంగంపేటలో ఉన్న తన చిన్నాన్న కుమారుడి సాయంతో ఈ నెల 5న కువైత్ నుంచి రైల్వేకోడూరుకు తన భార్యతో సహా వచ్చి లాడ్జిలో రూము తీసుకొన్నారు. 6న మృతుడు ఉంటున్న ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి 7వ తేది తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇంటి వరండాలో మంచంపై నిద్రిస్తున్న వృద్ధుడి తలపై ఇనుపరాడ్డుతో కొట్టి చంపి కువైత్‌కు వెళ్లిపోయారు.

కాగా పోలీసుల దర్యాప్తులో ఈ విషయాలన్నీ తెలియడంతో యూట్యూబర్ అయిన నిందితుడు ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశాడని, తనమీద బంధువులు, ప్రజల్లో సానుభూతి కలుగుతుందని తన కుమార్తెను అడ్డుపెట్టుకొని వీడియో అప్‌లోడ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా కువైత్ నుంచి తన భార్యతో కలిసి ఇండియాకు వచ్చి మండల పరిధిలోని మంగళంపల్లికి వెళ్లేదారిలో తన చిన్నాన్న కుమారుడితో కలిసి లాయర్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో రాజంపేట డీఎస్పీ ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ మహేష్ వారి సిబ్బందితో ఈ నెల 12న సాయంత్రం నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి ఫోన్లు, బైకు, హత్యకు ఉపయోగించిన రాడ్ స్వాధీనం చేసుకొని రిమాండ్ నిమిత్తం కోడూరులోని జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.



నిందితులతో పోలీసులు

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వివిధ కారణాలతో రెండు సార్లు వాయిదా పడగా, ముచ్చటగా మూడోసారి మూహూర్తం ఫిక్స్ అయింది. ఇందులో భాగంగా ఈ ప్రక్రియకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల కాగా, శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఉదయం 8గంటల నుంచి ప్రక్రియ ప్రారంభించి సాయంత్రానికి ఒకేరోజే చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికను పూర్తి చేయనున్నారు. ఇందుకోసం నీటిపారుదల, రెవెన్యూశాఖలు సంయుక్తంగా గ్రామస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశాయి. స్థానికంగా ఉన్న స్కూల్ లేదా గ్రామ సచివాలయంలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

● 2,338 మంది ఎన్నికల అధికారులు నియామకం
● జిల్లాలో 167 చెరువులకు టీసీలు, చైర్మన్ ఎన్నిక
● పెద్దేరు, బాహుదా సహా ప్రక్రియంతా ఒకే రోజే
● సామరస్య ఎన్నికకే ప్రథమ ప్రాధాన్యం
● తంబళ్లపల్లె, మరికొన్ని చోట్లా కసరత్తు పూర్తి

మదనపల్లె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 3,276 చెరువులు ఉండగా, అందులో వంద ఎకరాలు, ఆపై విస్తీర్ణం ఉన్న 167 చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఒక్కో చెరువునకు మొత్తం టెరిటోరియల్ కాన్‌స్టెన్సీ(టీసీ) ఆరు టీసీలను ఎన్నుకోగా, వారి నుంచే చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఇప్పటికే ఇరిగేషన్, రెవెన్యూశాఖ సంయుక్తంగా ఆయకట్టు రైతుల జాబితా సిద్ధం చేయగా, భూమిశిస్తు నిర్ణయించగా, ఆశావహులు బకాయిలు చెల్లించి, నామినేషన్‌కు ఎలాంటి అభ్యంతరం లేకుండా లైన్‌క్లియర్ చేసుకున్నారు. ఈక్రమంలో ఇప్పటికే ఆయా గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల్లో టీసీలు, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎవరన్నది స్థానికంగా ఉన్న స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రభుత్వం ముందుగా చెప్పినట్లు ఎలక్షన్ కాకుండా ఎంపిక పద్ధతిలోనే ప్రక్రియ పూర్తి చేయనున్నారు. అయితే అక్కడక్కడ ఏకాభిప్రాయం కుదరని పక్షంలో మాత్రమే పోటీ..ఆపై చేతులు ఎత్తే విధానం అదీ లేకుంటే స్లిప్పుల పద్ధతిలో ఎన్నికలకు వెళ్లనున్నారు. ఇదిలా వుండగా, ఇప్పటికే రెండుసార్లు ఎన్నికల తేదీ ఫిక్స్ అయినా.. వివిధ కారణాలతో వాయిదా పడింది. ఇందులో భాగంగా మొదట్లో నవంబరు 20న నోటిఫికేషన్ వెలువడగా, 21న ఎన్నికలు జరగాల్సి వుంది. అలాగే రెండోసారి డిసెంబరు 5న నోటిఫికేషన్, 8న ఎన్నికలు ఉండేవి. తాజాగా డిసెంబరు 11న నోటిఫికేషన్ వెలువడగా, నేడు 14న ఎన్నికలకు మూహూర్తం ఖరారైంది. ఒక సారి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, మరోసారి తుఫాన్లు ఉన్నాయని ఇలా..రెండుసార్లు ఎన్నికలు వాయిదా వేశారు.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్లలో ఎన్నికల నిర్వహణకు మొత్తం 2,338 మంది అధికారులు సిబ్బందిని నియమించారు. ఇందులో ఒక్కో చెరువునకు జరిగే ఎన్నికకు ఎన్నికల అధికారి ఒకరు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఒకరు, పోలింగ్ అధికారులు ఆరుగురు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు ఆరుగురు చొప్పున కేటాయించారు. ఇప్పటికే వీరందరికీ శిక్షణతో పాటు తాజాగా ఎన్నికల నిర్వహణ, విధి విధానాలపై ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు. ఇదిలావుండగా, జిల్లాలో ఎక్కడా లేని విధంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 37 చెరువులు, పెద్దేరు ప్రాజెక్టుకు ఎన్నికల నిర్వహణ జాబితాలో ఉన్నాయి. అయితే స్థానిక టీడీపీ ఇన్‌ఛార్జి డి.జయచంద్రారెడ్డి.. మూడురోజులుగా ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలు, మండలాల నేతలు, రైతులతో మాట్లాడి టీసీలు, చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎంపికలో కసరత్తు చేసి, ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. పార్టీలు, వర్గాలకు అతీతంగా జరిగే ఎన్నికలు కావడంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించనున్నారు.



సాగునీటి ఎన్నికలు జరగనున్న నిమ్మనపల్లె ఉన్నత పాఠశాల

పోలింగ్ ప్రక్రియ షెడ్యూల్

- ఉదయం 8 గంటలకు ముందుగానే ఎన్నికల అధికారులు, రైతులు నిర్ణీత కేంద్రానికి చేరుకోవాలి. ఉదయం 8 గంటలకు రైతులతో సమావేశం ప్రారంభించాలి.
- 9 గంటలకు ఓటర్ల(రైతులు)ను పోలింగ్ కేంద్రానికి అనుమతించడం, టీసీల వారీగా కూర్చోబెట్టి ఎన్నికల నియమ, నిబంధనలు చెప్పాలి.
- 9 నుంచి 9:15 వరకూ రైతులకు ఎన్నికల ఆవశ్యకత, ఏకగ్రీవ ఎన్నిక అవసరాన్ని వివరించాలి.
- 9:15 నుంచి 9:45 గంటల వరకు ఏకాభిప్రాయం లేని చోట ఓటర్లు చేతులెత్తి టీసీని ఎన్నికోవడం, లేదా ఓటింగ్ స్లిప్పుల ద్వారా తెలుసుకోవడానికి ఏర్పాట్లు చేయాలి.
- 9:45 నుంచి 10:15 గంటల వరకు పోటీదారుల నుంచి నామినేషన్లు స్వీకరణ.
- 10:15 గంటల నుంచి 10:30 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, టీసీల వారీగా పోటీదారుల జాబితా ప్రదర్శన.
- 10:30 నుంచి 12:30 గంటల వరకు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల(టీసీ)లను పోలింగ్ ప్రక్రియలో ఎన్నుకోవడం.
- మధ్యాహ్నం ఒక గంటకు ఓటింగ్ స్లిప్పుల లెక్కింపు, ఫలితాల ప్రకటన.
- మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ టీసీలతో సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్షున్ని ఎన్నుకోవాలి. అంతకు ముందు జరిగే ఓటింగ్ ప్రక్రియకు ప్రతి ఒక్క రైతూ ఓటరు గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి. ఫొటోతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం, ఫొటోతో కూడిన వన్‌బీ లేదా ఆధార్‌కార్డు ఉండాలి. ఇవేమీ లేకుంటే, ఆయకట్టు రైతుగా వీఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం ఉండాలి. ఒక రైతుకు ఆరు టీసీల్లో భూమి ఉన్నా.. రైతుకు ఓటుకు, పోటీకీ ఒక చోటే అవకాశం ఉంటుంది.

యువరైతు బలవన్మరణం


● అప్పుల బాధతో పాటు టమోటా ధరల పతనంతో మనస్థాపం
● పొలం వద్దే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య

ములకలచెరువు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు తగ్గడం.. అప్పుల బాధ తాళలేక ఓ యువరైతు బలవన్మరణం పొందాడు. పొలం వద్దే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం మేరకు...

ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన సోగసాని బయ్యారెడ్డి (42) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య మల్లిక, ఇద్దరు కుమార్తెలు శ్రీతేజ, సింధు ఉన్నారు. తనకున్న రెండున్నర ఎకరాలతో పాటు పక్కన మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. గత పదేళ్లుగా టమోటా పంట సాగు చేస్తూ వస్తున్నాడు. ఎప్పుడూ ధరలు లేక నష్టాలే వస్తున్నాయి. పంటల సాగు కోసం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. అలాగే భూమి కూడా తాకట్టు పెట్టి రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఇప్పుడు కూడా మూడు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశాడు. ఒకటిన్నర ఎకరాలో ప్రస్తుతం టమోటాలు కోతకు వచ్చాయి. మార్కెట్‌కు తరలించేందుకు గురువారం కూలీలను పెట్టి టమోటాలు కోత విధించి బాక్సుల్లో నింపాడు. ఈ క్రమంలో వర్షం వస్తే బాక్సుల్లోని టమోటాలు తడిసిపోతాయని, పట్టా కప్పి వస్తానని ఇంట్లో చెప్పి శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. పది రోజులుగా టమోటా ధరలు పతనం కావడంతో ఈసారి కూడా నష్టమే వస్తుందని భావించాడు. పంటల సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక కుమిలి పోయాడు. చివరకు ఉదయం ఆరు గంటల సమయంలో పొలం వద్దనున్న మామిడి చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం వద్దకు వెళ్లిన తన భర్త ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో భార్య మల్లిక తన పెద్ద కుమార్తెను వెంటబెట్టుకుని వెళ్లి చూడగా చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు బోరున విలపించారు. సంఘటనా స్థలాన్ని సీఐ లక్ష్మన్న, ఎస్‌ఐ నరసింహుడు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.



ఆత్మహత్య చేసుకున్న బయ్యారెడ్డి



కోతకు వచ్చిన టమోటా పంట

రిమాండ్‌కు వైసీపీ కార్యకర్త సుధారాణి 6

బ్రౌన్ శాస్త్రి.. జానమద్ది

● నేడు జానమద్ది శతజయంతి స్మారకోపన్యాసం 6

ఆధ్యాత్మిక, ఆరోగ్య, పర్యావరణ పర్యాటకంతో అపార అవకాశాలు



సెమినార్ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మిల్టన్

పీలేరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జీవ, భౌగోళిక వైవిద్యం ఎక్కువగా ఉన్న మన దేశంలో ఆధ్యాత్మిక, ఆరోగ్య, పర్యావరణ రంగాలతో పర్యాటక రంగాన్ని అనుసంధానం చేస్తే యువతకు అపార ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెన్నైలోని సవిత విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ మిల్టన్ అన్నారు. 'పర్యావరణ పర్యాటకం-సుస్థిరాభివృద్ధి' అంశంపై శుక్రవారం స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ సెమినార్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్లోబలైజేషన్ కారణంగా దేశంలో సాహస క్రీడలు చేసే వారు, ప్రకృతి ప్రేమికులు, పర్యటనలపై ఔత్సాహికుల సంఖ్య పెరిగిందన్నారు. పర్యావరణ పర్యాటకంతో కేవలం ఆర్థికాభివృద్ధి మాత్రమే కాకుండా పర్యావరణ అవగాహన, అభివృద్ధి, పరిరక్షణ కోణాలను ఆవిష్కరించేలా ప్రభుత్వాలు విధానాలు రూపొందించుకోవాలన్నారు. పర్యాటక ప్రదేశాలను గుర్తించడమే కాకుండా వాటిని అభివృద్ధి చేసి పెద్దఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. బెంగళూరులోని గార్డెన్ సిటీ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ సుమిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగంలో పరిశోధన అధ్యయనాలు ఊపందుకున్నాయని, వాటి ఫలాలను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వాలు చురుగ్గా వ్యవహరించాలన్నారు. కళాశాల స్థాయి నుంచి పర్యాటక రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే వారు అపారమైన అవకాశాలు అందిపుచ్చుకోగలరన్నారు. కళాశాల వైస్-ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, సదస్సు సమన్వయకర్త డాక్టర్ వెంకటరమణయ్య, గుల్బర్గా కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు గంగినేని రంగనాథం, డిగ్రీ కళాశాల అధ్యాపకులు సంధ్యా ఆదూరి, రఫీ, ఖాదర్ బాషా, ప్రశాంత, వివిధ వర్సిటీల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం తరలింపు

కలికిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఉన్న డిప్యూటీ జిల్లా మెడికల్, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని కుప్పం తరలిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ అనుమతులు కూడా పొందినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు శుక్రవారం జీఓ నంబరు 155 జారీ చేశారు. కాగా మదనపల్లెను జిల్లా కేంద్రం చేయాలన్న ప్రజల డిమాండుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తమవుతున్న నేపథ్యంలో అక్కడ ఏకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉన్నందున ప్రస్తుత డిప్యూటీ ఎంహెచ్ఓ కార్యాలయం అవసరం వుండదన్న ఉద్దేశంతో ఈ కార్యాలయాన్ని కుప్పంకు తరలిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెపుతున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కడపరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి కడప జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో 20 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 2, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టుల్లో ఒక్కొక్క బెంచ్ ఏర్పాటు చేశామన్నారు. రాజంపేటలోని మూడవ అదనపు జిల్లా కోర్టుకు సంబంధించిన కేసులను కడప నాల్గవ అదనపు జిల్లా కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే రైల్వేకోడూరు కోర్టుకు సంబంధించిన కేసులు రాజంపేట ఏడీఎం కోర్టు బెంచ్‌లో, సిద్దవటం కోర్టుకు సంబంధించిన కేసులు బద్వేల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులు తమ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందాలని సూచించారు.

రిమాండ్‌కు వైసీపీ కార్యకర్త సుధారాణి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమార్తెపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన నిందితురాలు, వైసీపీ కార్యకర్త సుధారాణిని రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గత నెల 1వ తేదీన మదనపల్లెకు చెందిన జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం మదనపల్లె టూటౌన్‌లో ఈమెపై ఫిర్యాదు చేశారు. దీంతో గుంటూరు జిల్లా నరసారావుపేటకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణి (32) నిర్వహిస్తున్న రెడ్డిగారి అమ్మాయి, రెడ్డి 2022 సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కుమార్తెలపై పోస్టులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే గుంటూరులో అరెస్టు చేశారు. గురువారం రాత్రి ఆమెను పీటీ వారెంట్‌పై గుంటూరు నుంచి మదనపల్లెకు పోలీసులు తీసువచ్చి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం నిందితురాలను మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచి తిరిగి గుంటూరుకు రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

బ్రౌన్ శాస్త్రి.. జానమద్ది



తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం ● నేడు జానమద్ది శతజయంతి స్మారకోపన్యాసం
స్మారక ఉపన్యాస పరంపర వేడుకలు ● హాజరుకానున్న విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు సూర్యుడు సీపీబ్రౌన్, ప్రముఖ సాహితీవేత్త జానమద్ది హనుమశాస్త్రి కలగలిసిన పరిశోధన కేంద్రమే సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం. అది గ్రంథాలయమే కాదు ఎన్నో గ్రంథాల సంపుటాలు, చరిత్రకు అందించే సంక్షిప్త వివరాలు, విరబూసిన సాహితీ కుసుమాల సమాహారంగా నిలిచింది. కడప పట్టణంలో సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం నెలకొల్పి నిరంతరం శ్రమించి ఎన్నో సాహితీ కార్యక్రమాలను నిర్వహించి తెలుగునాట బహుముఖ సాహితీవేత్త, విశ్వంభర గ్రంథకర్త, డాక్టర్ సి.నారాయణరెడ్డిచే బ్రౌన్ శాస్త్రిగా గౌరవించబడ్డారు జానమద్ది హనుమశాస్త్రి. గ్రంథాలయాన్ని నిర్మించి తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం కల్పించిన మహోన్నతులు డాక్టర్ జానమద్ది శతజయంత్యుత్సవాలు శనివారం వేడుకగా నిర్వహించనున్నారు. వివరాల్లోకెళితే...

రాష్ట్రంలో అత్యంత వెనకబడిన అనంతపురం జిల్లా రాయదుర్గం వాసులు జానకమ్మ, సుబ్రమణ్యశాస్త్రి పుణ్యదంపతుల ముద్దుల పట్టి జానమద్ది హనుమశాస్త్రి 1925 అక్టోబరు 20న జన్మించారు. రాయదుర్గం జిల్లా బోర్డు హైస్కూల్లో ఎస్ఎస్ఎల్సీ వరకు చదుకుంటూనే ప్రైవేట్‌గా బీఏ, బీఎడ్ పూర్తిచేశారు. పట్టుదలతో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రావీణ్యం సాధించారు. అంతేకాకుండా తెలుగు ఆంగ్ల భాషల్లో ఎంఏ పట్టా సాధించారు. తర్వాత బళ్లారిలోని ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా ఉద్యోగ ప్రస్థానం ఆరంభించారు. జానమద్ది శాస్త్రి కథా రచయితగానే కాకుండా వివిధ పత్రికలకు 2500పైగా వ్యాసాలు, 16 గ్రంథాలు రాశారు. సీపీ బ్రౌన్ మీద పరిశోధన చేశారు. ఫలితంగా కడప పట్టణంలో సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం నెలకొల్పి నిరంతరం శ్రమించి పరిశోధన కేంద్రం స్థాయికి తీసుకెళ్లారు. సాహిత్యంలో పట్టున్న ఆయన ఎన్నో సాహితీ కార్యక్రమాల ద్వారా ఎందరో సాహితీ ప్రముఖులను ఆహ్వానించారు. ఆయన శ్రమను గుర్తించిన తెలుగునాట బహుముఖ సాహితీవేత్త, విశ్వంభర గ్రంథకర్త, డాక్టర్ సి.నారాయణరెడ్డిచే బ్రౌన్ శాస్త్రిగా గౌరవించారు. ఎంతో చరిత్ర కలిగి సదాస్మరణీయ పండితులుగా ఖ్యాతి దక్కించుకున్న జానమద్ది తెలుగువారి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. బ్రౌన్ గ్రంథాలయం కోసం నిరంతరం శ్రమించిన ఆయన 2014 ఫిబ్రవరి 28న తుదిశ్వాస విడిచారు. అందరికీ జానమద్ది, ఎందరికో జ్ఞానమద్దియని, బ్రౌన్ గ్రంథాలయ భవనానికి నిలువెత్తు ద్వారమై నిలిచారని ప్రశంసలు అందుకున్న మహోన్నత సాహితీవేత్త. స్ఫూర్తి ప్రదాత జానమద్ది సాహితీ సేవలు సదాస్మరణీయం.

సాహితీ సేవలు

కడపలో సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ ట్రస్టును నెలకొల్పి కార్యదర్శిగా ఉంటూ అహర్నిశలు శ్రమించి రూ.10లక్షల విరాళాలు సేకరించారు. ఈ కేంద్రానికి 15వేల గ్రంథాలను శాస్త్రి సేకరించి బ్రౌన్ ద్విశతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించి బ్రౌన్ శాస్త్రిగా పేరుగాంచారు. 1973లో కడప జిల్లా రచయితల సంఘం స్థాపించి 20ఏళ్ల కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్రంలోని సుప్రసిద్ధ రచయితలను కడప జిల్లాకు పరిచయం చేశారు. బెజవాడ గోపాలరెడ్డి, ఆరుద్ర, దాశరథి, కుందుర్తి, పురిపండా అప్పలస్వామి, శ్రీశ్రీ, సి.నా.రె., దేవులపల్లి రామానుజరావు, దివాకర్ల వెంకటావధాని వంటి రచయితలను కడప జిల్లాకు ఆహ్వానించి చక్కని కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

ప్రముఖ గ్రంథ రచనలు

మా సీమకవులు, నాట్యకళా ప్రపూర్ణ బళ్లారి రాఘవ (జీవిత చరిత్ర), కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం, కడప సంస్కృతి-దర్శనీయ స్థలాలు, మన దేవతలు, భారతరత్నం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత చరిత్ర, సీపీ బ్రౌన్ చరిత్ర, మొండి గోడల నుంచి మహాసౌధం దాకా, విదురుడు, త్యాగమూర్తుల మనిషి, నీకు అసాధ్యమేదీ, ఎందరో మహాద్భావులు, భారత మహిళ, శంకరంబాడి సుందరాచారి, పురస్కారాలు, సత్కారాలు అనేక అవార్డులు లభించాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి గౌర డాక్టరేట్, లోకనాయర్ ఫౌండేషన్ సాహితీ పురస్కారం, (2011) గుంటూరులో అయ్యంకి వెంకటరమణయ్య అవార్డు, అనంతపురం లలిత కళా పరిషత్ అవార్డు, ధర్మవరం కళాజ్యోతి వారి సిరిని ఆంజనేయులు అవార్డు, కడప సవేరా ఆర్ట్స్ వారి సాహితీ ప్రపూర్ణ అవార్డు, మదనపల్లె భరతముని కళారత్న అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, బెంగుళూరులో అఖిల భారత గ్రంథాలయ మహాసభ పురస్కారం, ఉడిపి పెజావరు పీఠాధిపతిచే ధార్మికరత్న బిరుదు మొదలైనవి సాధించారు.



సీపీ బ్రౌన్ గ్రంథాలయం ఇన్‌సెట్‌లో జానమద్ది కాంస్య విగ్రహం

హాజరు కానున్న జస్టిస్ ఎన్వీ రమణ

కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం జానమద్ది శతజయంతి స్మారక ఉపన్యాస పరంపరలో భాగంగా తెలుగు భాషా వైభవం పేరిట జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ హాజరు కానున్నట్లు జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, వైవీయూ రిజస్ట్రార్ పి.పద్మ తదితరులు పాల్గొంటారన్నారు.

నేటి నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు

● 35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ● 175 మంది పోలీసులతో బందోబస్తు

కాశినాయన డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): వరికుంట్ల సమీప జ్యోతి క్షేత్రంలో కాశిరెడ్డినాయన 29వ ఆరాధనోత్సవాలు శనివారం నుంచి వేడుకగా ప్రారంభమవుతున్నట్లు నిర్వహకులు తెలిపారు. రెండు రోజులు నిర్వహించే ఉత్సవాల్లో మొదటిరోజు గణపతి పూజతో ప్రారంభమై హోమాలు, కాశినాయన పాలరాతి సమాధికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రికి జ్యోతి ప్రజ్వలన, రథోత్సవం ఉంటుంది. 15న కాశినాయన యోగ సమాధికి అభిషేకం, రాత్రి నిర్వహించే పల్లకి ఉత్సవంతో ఆరాధనోత్సవం ముగుస్తుంది.



కాశినాయన కాంస్య విగ్రహం - విద్యుత్ దీపాలంకరణలో ఆలయం ముఖ ద్వారం

విద్యుత్ దీపాలతో ఆలయం ముస్తాబు

కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాల కోసం ఆలయం ముస్తాబు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీనరసింహ స్వామి, గరుడుడు, హనుమంతుల వారి ముఖాలను ముస్తాబు చేసి ఆలయం ముందు భాగం ప్రవేశ ద్వారం ముస్తాబు చేశారు.

35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

కర్నూలు, గుంటూరు, ఒంగోలు జిల్లాల నుంచి కాశినాయన ఆరాధకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గిద్దలూరు బస్టాండు, రైల్వేస్టేషన్ నుంచి 15 ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు గిద్దలూరు డిపోమేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. కడప జిల్లాలోని మైదుకూరు, పోరుమామిళ్ల, బ్రహ్మంగారి మఠం నుంచి 20 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు మైదుకూరు సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయమ్మ తెలిపారు. 14వ తేదీ ఉదయం నుంచి 15 వతేదీ రాత్రివరకు ఈసర్వీసులు నిరంతరం నడుస్తాయన్నారు.



అన్నదానం కోసం భక్తులు ఇచ్చిన కూరగాయలు

175 మంది పోలీసులతో బందోబస్తు

కాశినాయన ఆరాధన కోసం మైదుకూరు డీఎస్పీ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు అధ్యక్షతన 175 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ముగ్గురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, 149 మంది పోలీసులు, 15 మహిళా పోలీసులు విధుల్లో ఉంటారన్నారు.

పత్తూరులో ఉత్సవాలు

ఖాజీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు పత్తూరులో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వేకువజాము నుంచే మహాగణపతి, అన్నపూర్ణాదేవి, నవగ్రహాలకు, కాశిరెడ్డినాయన మూలవిరాట్టుకు అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం చెక్కభజన (కులుకు), సాయంత్రం కోలాటాలు, రాత్రి భక్త చింతామణి, ఆదివారం ఉదయం 7 గంటలకు స్వామివారికి మహానైవేద్యం, 10 గంటల నుంచి హరినామ తాళభజన నిర్వహిస్తారని కమిటీ తెలిపింది. విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు వివరించారు. భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు భారీ ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు.

బండలాగుడు పోటీలు

కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు పురస్కరించుకుని వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు, 6వ బహుమతి రూ.5 వేలు చెల్లించనున్నారు. కాగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా గట్టి బందోబను ఏర్పాటు చేయనున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.



ముస్తాబైన వీఎన్‌పల్లెలోని కాశినాయన ఆలయం

వీరపునాయునిపల్లె: మహిమాన్వితుడు అన్నదాన ప్రభువు అనునిత్యం భక్తుల నోట పిలవడమే అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో ఆరాధన ఉత్సవాలకు ముస్తాబైంది. మండలంలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద నున్న కాశినాయన 29వ ఆరాధన జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 15వ తేదీన ఆదివారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భజన కార్యక్రమాలు, సంకీర్తనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు మెరవణి నిర్వహించడం జరుగుతుందన్నారు. అమ్మఒడి చారటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. లాగే న్యూకేటగిరి రాష్ట్రస్థాయి విభాగంలో బండలాగుడు పోటీలు జరుగుతాయని చెప్పారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

డాక్టరు రమేష్‌బాబుపై డీఎంహెచ్‌ఓ విచారణ



ఆస్పత్రిలో విచారణ చేపడుతున్న డీఎంహెచ్‌ఓ

నిమ్మనపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారిగా పని చేస్తున్న రమేష్‌బాబుపై శుక్రవారం అన్నమయ్య జిల్లా డీఎంఅహెచ్‌ఓ కొండయ్య విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ నాగేంద్రబాబు సీఎం పేషీకి డాక్టరు రమేష్ బాబుపై ఉన్నతాధికారుల అనుమతి లేకుండా జీతం నిలిపివేయడం, అటెండెన్స్ ఇవ్వక పోవడం, ఎఫ్ఆర్ఎస్ కట్‌చేసి సరెండర్ చేయండంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో సిబ్బంది, డాక్టరును విచారించి దీనిపై పూర్తి వివరాలను ఉన్నతాధిరులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే నాగేంద్రబాబు గతంలో డీఎంహెచ్‌ఓకు తాను ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోక పోవడంతో సీఎం పేషీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం డీఎం హెచ్‌ఓ కొండయ్య రికార్డులను పరిశీలించి సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు.

వ్యవసాయం ఆయన ఉద్యోగం



ఆశాజనకంగా కనపడుతున్న చీనీ చెట్లు

నోరు ఎర్రన.. బతుకు పచ్చన.... ● కడుపు నింపే కొత్త వరివంగడాలు
సంప్రదాయ ఎరువులతో సాగు ● పంటల సాగుతో ఆకట్టుకుంటున్న రైతు

దువ్వూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం అనేక రకాల పనులను చేస్తుంటా రు. కొందరు ఉద్యోగం, మరికొందరు చేతి వృత్తులు, మరికొందరు సొంత పనులు, వ్యాపారం, గ్రామాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇందులో జీవన భృతి కోసం మొదట ఎంచుకునేది ఉద్యోగం. చిన్న ఉద్యోగమైనా నెల తిరిగేలోపు జీతం వస్తుందని, జీవితానికి భరోసాగా ఉంటుంది. దీంతో గ్రామాలను సైతం వదిలేసి పట్టణాల్లో ఉద్యోగాలకు, చేతి వృత్తులు, సొంత వ్యాపారం చేసుకుంటుంటారు. అయితే ఇక్కడ ఒక రైతు వ్యవసాయమే ఉద్యోగంగా ఎంచుకుని జీతం కంటే అధికంగా ఆర్జిస్తున్నారు. మొక్కుబడి వ్యవసాయం చేయకుండా నేల సార వంతాన్ని గమనిస్తూ సంప్రదాయ ఎరువులు, మందులు వినియోగిస్తూ భూమి పోషక విలువలను అందిస్తూ పంటలో పట్టుసాధిస్తున్నారు బండి చలపతి చేస్తున్న ఉద్యోగం వివరాల్లోకెళితే....




తమలపాకుల తోట

దువ్వూరు మండలం రాంసాయినగర్ వాసి రైతు బండి చలపతి అందరికీ భిన్నంగా పంటలసాగుకు పూనుకుంటున్నారు. చిన్నప్పటి నుంచే వ్యవసాయాన్ని ప్రాణంగా చేస్తున్నాడు. 35 ఏళ్లగా వ్యవసాయం అనే ఉద్యోగం చేస్తున్నారు. ఫలితం గా ఉద్యోగులకంటే ఎక్కువగా ఆర్జిస్తున్నారు. రసా యనిక ఎరువులు, పురుగుల మందులను వినియోగించకుండా సంప్రదాయ ఎరువులు, కషా యాలను వాడుతున్నారు. ఆవుల ద్వారా ద్రవ, ఘన జీవామృతాలు, సొంతంగా తయారు చేసుకున్న కషాయాలను వాడుతూ ఇతర రైతులను కూడా చైతన్య పరుస్తుంటారు. వ్యవసాయం మొక్కుబడిగా చేయరాదని, పంటల మార్పిడితో ఆశాజకంగా దిగుబడి వస్తుందని, విచక్షణా రహితంగా పురుగు మందుల వాడకం, రసాయనిక ఎరువులు చల్లడం మంచిది కాదని ఆయన రైతులకు వివరిస్తుంటారు. తినే పంటలో కూడా అవే విషపదార్థాలు తయారై మానవుని జీవన ప్రమాణాన్ని తగ్గిస్తుందని, అంతేకాకుండా నేల సారవంతం తగ్గిపోయి, భూమికి తగిన పోషక విలువలు తగ్గిపోతాయని, ఫలితంగా రైతులు సాగులో పట్టుకోల్పోతూ నష్టాలు చవిచూస్తుంటారని పలు సందర్భాల్లో రైతులకు వివరిస్తుంటారాయన. దీం తో ఆప్రాంతంలో చలపతి గురించి తెలియనివారుండరనడం అతిశయోక్తి కాదు. ఆయనకున్న 15 ఎకరాలకు తోడు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటల సాగు చేపట్టారు. ప్రస్తుతం తమలపాకు, పసుపు, చీనీ చెట్లు ఈ ప్రాంతంలో ఎవరూ సాగు చేయని వరి వంగడాలు వేశారు. రత్నచూడు, బహురూటి, చిట్టిముత్యాలు వంటి కొత్త వంగడాలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పిం చి వరి పంటను సాగు చేశారు. మన ప్రాంతంలో వరి ధాన్యం రేటు కంటే బస్తాపై వెయ్యి నుంచి రూ.1500 అధిక రేటు పలుకుతాయి. ఈ గింజలకు సంబంధించిన రైస్‌ను షుగర్ పేషెంట్లు కూడా తినవచ్చని రైతు చలపతి వివరిస్తున్నారు. ఈ విషయం డాక్టర్లు సైతం ధృవీకరించారని అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. తమలపాకు, చీనీ ధరలు సరేసరి. ఇప్పటికే కొంత విస్తీర్ణంలో అంజూర, సపోట వంటి పంటలు సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా లాభసాటి వ్యవసాయంవైపే ఈయన మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతంలో గతంలో బొప్పాయి, ఖర్బూజ, అంజూర, ఇతర పంటలు సాగు చేశారు. కొత్తరకం పంటల సాగుతో ఆశాజనక దిగుబడులు సాధిస్తూ మిగతా రైతులకు ఆదర్శప్రాయుడిగా నిలుస్తున్నాడు.



రత్నచూడు రకం వరి

వరి సాగులో రసాయనిక మందులు వాడను



మొక్కుబడిగా వ్యవసాయం చేయడం నాకు నచ్చదు. కొత్త వరి వంగడాల సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకానికి నేను దూరం. జనుము, జీలుగ మాత్రమే పచ్చిరొట్ట ఎరువుగా వాడతాను. ఆవు మూత్రంను వినియోగిస్తాను. పంటలకైన పెట్టుబడులు బాగా తగ్గిస్తాను. ప్రకృతి వ్యవసాయం అంటే నాకు ఇష్టం. లాభదాయక పంటల సాగుపై మొగ్గుచూపుతాను.

బండి చలపతి, రాంసాయినగర్, దువ్వూరు మండలం



లక్ష్మీపేటలో పింఛన్లు తనఖీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

బోగస్ పింఛన్ల ఏరివేతకు రంగం సిద్ధం



● దివ్యాంగ పింఛన్లపైనే అనుమానాలు ● ఇప్పటికే వేయికి పైగా గుర్తింపు ● వృద్ధాప్య పింఛన్లపై కూడా..

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో బినామీలు పొందుతున్న బోగస్ పింఛన్ల ఏరివేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఈ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టు కింద చాపాడు మండలంలోని లక్ష్మీపేటలో మొదలు పెట్టడం జరిగింది. సోమవారం చేపట్టిన విచారణలో 380 మంది లబ్ధిదారులు అందుబాటులో ఉండగా... 20 మంది అందుబాటులో లేరని తెలుస్తోంది. అధికారులు తనిఖీ చేసిన పింఛన్‌లలో ఎంత మంది అర్హులు అనేది అధికారులు చెప్పడం లేదు. నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తామని విచారణ అధికారులు పేర్కొన్నారు. రెండవ రోజు మంగళవారం మిగిలిన 20 పింఛన్లకు సంబంధించి విచారణ చేపట్టగా.. నలుగురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకార నిక్కచ్చిగా సర్వే నిర్వహిస్తే .. పెద్దఎత్తున పింఛన్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నాయి. నిరుపేదల మాటున చాలా మంది అనర్హులు పింఛన్ పొందుతున్న సందర్భాలు ఉన్నాయి. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వంలో వేల సంఖ్యలో పింఛన్లు పెరిగిపోవడం చూస్తే పింఛన్ల లబ్ధిదారుల అర్హతలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో లబ్ధిదారుల ఆస్తులను అంచనా వేయడం కష్టతరంగా మారుతోందని తెలుస్తోంది. చాలా మంది తమ ఆస్తులను గోప్యంగా ఉంచి పింఛన్లు పొందుతున్నట్లు తెలుస్తోంది.

దివ్యాంగ పింఛన్లపైనే అనుమానాలు...

గత ప్రభుత్వ హయాంలో వికలత్వపు పింఛన్లు భారీగా పెరిగాయి. పింఛన్ల కోసం మాయరోగాన్ని సృష్టించుకొని కొంతమంది ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. వీటిపై భారీ స్థాయిలో ఆరోపణలు రావడంతో 1087 బోగస్ సదరం సర్టిఫికెట్లను ఆగస్టు నెలలో వైద్యాధికారులు గుర్తించారు. జిల్లాలో వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు ఇతర జిల్లాలలో ఉన్న ఆసుపత్రుల ద్వారా సర్టిఫికెట్లు పొందినట్లు గుర్తించారు. ఈ క్రమంలో మరిన్ని పింఛన్లలో అర్హులు ఎంతమంది ఉన్నారని దానిపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఇదే అంశంపై గురువారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిపై జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్చించారు. రాష్ట్రంలో వివిధ సామాజిక పింఛన్లు అర్హులకు అందేలా, అనర్హులను తొలగించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా వికలత్వపు ధ్రువీకరణ కోసం సాంకేతిక, హైబ్రిడ్ విధానాలను వినియోగించి ఫిజికల్ వెరిఫికేషన్‌తో అనర్హులను తొలగించాలని సూచించారు. అదేవిధంగా వికలాంగులకు జారీ చేసే సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలను పూర్తిగా నివారించాలన్నారు. సర్టిఫికెట్లు జారీచేసే డాక్టర్లు మెడికల్ బోర్డు మార్గదర్శకాలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సదరం సర్టిఫికెట్ల జారీలో మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు.

వృద్ధాప్య పింఛన్లపై కూడా...

వృద్ధాప్య పింఛన్లు వయసు ఆధారితంగా మంజూరు అవుతున్నాయి. ఈ క్రమంలో వాస్తవంగా తక్కువ వయస్సు ఉన్నప్పటికి ఆధార్‌కార్డులో వయస్సు పెంచుకొని పింఛన్లు పొందుతున్న వారు కూడా జిలల్లాలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నిజమైన అర్హులు పింఛన్ పొందే అవకాశాన్ని కోల్పోతున్న పరిస్థితి. ప్రస్తుతం జిల్లాలో గత నెలలో 1,34,717 మందికి వృద్ధాప్య పింఛన్లు, 37,785 మందికి వికలత్వపు పింఛన్లు, 940 మందికి పూర్తి వికలత్వపు పింఛన్లు, 58410 మందికి వితంతు పింఛన్లు, 3836 మంది ఒంటరి మహిళల కింద పింఛన్లను పంపిణీ చేశారు. ప్రధానంగా ప్రభుత్వం వీటిపైనే దృష్టి సారించనుంది. వికలత్వ పింఛన్లలో అధికభాగం వినికిడి లోపం మానసిక వికలత్వం సర్టిఫికెట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు విచారిస్తే పింఛన్ల జాబితా నుంచి ఎక్కువ సంఖ్యలోనే అనర్హులు దొరికిపోయే అవకాశాలు కూడా లేకపోలేదు.

20,24 తేదీలలో అంతర్ కళాశాలల యోగా, ఖోఖో క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య క్రీడా శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల యోగా, ఖోఖో క్రీడా పోటీలు వైవీయూ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 20న యోగా, 24న ఖోఖో పోటీలు స్త్రీ, పురుషులకు ఉంటాయన్నారు. ఈ క్రీడలలో పాల్గొనే ఆసక్తిగల విద్యార్థులు 2024 జూలై 1వ తేదీ నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు కలిగి, విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో చదువుతూ ఉండాలన్నారు. విద్యార్థులు స్టడీ, టెన్త్ మార్క్స్‌మెమో, ఇంటర్మీడియట్ మార్క్స్ మెమో ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9705459052, 7997047676 నెంబర్లను సంప్రదించాలన్నారు.

22న సన్నపురెడ్డికి కేతు స్మారక జీవిత సాఫల్య పురస్కారం

కడప కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాసి ప్రముఖ కథా నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి ఈనెల 22వ తేదీ ఆదివారం నగర సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, స్వర్గీయ కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవిత సాఫల్య పురస్కారం అందించనున్నట్లు కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి వెల్లడించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి సుమారు 80 కథలు, 7 నవలలు రాశారన్నారు. ఆయన రాసిన చాలా కథలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదమయ్యాయన్నారు. ప్రధానంగా ఆయన రాసిన మొదటి కాడి అనే నవల అమెరికా వారి తానా నవలల పోటీలో బహుమతి దక్కించుకుందన్నారు. కొండపొలం అనే నవల అదే పేరుతో సినిమాగా కూడా రూపొందిన సంగతి తెలిసిందే అన్నారు. కాగా, తమ కుమార్తె కవిత స్మారకార్థం గత 2010లో సంస్థను ఏర్పాటు చేసి పలు సాహిత్య, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి యేడాది వివిధ ప్రక్రియలలో రచయితలకు పురస్కారాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. గత యేడాది మన జిల్లా వాసి ప్రసిద్ధ రచయిత కేతు విశ్వనాథరెడ్డి స్వర్గస్థులైన నేపథ్యంలో ఆయన స్మారకార్థం కేతు స్మారక జీవిత సాఫల్య పురస్కారం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమానికి కవులు, రచయితలు హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

లారీ, బైకు ఢీ...ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలంలో లారీని ఢీకొన్న బైకు

ముద్దనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప తాడిపత్రి జాతీయ రహదారిలోని గంగాదేవిపల్లె వద్ద శుక్రవారం లారీ, బైకు ఢీ కొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి.

స్థానికుల సమాచారం మేరకు.. తాడిపత్రి వైపు నుంచి ముద్దనూరు వైపు లారీ వెలుతుండగా గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున(30), రామచంద్ర(31)లు బైకు పై గ్రామంలో నుంచి వచ్చి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వెంటనే 108లో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు తరలించినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

రామసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు-ఈడిగపల్లె మార్గంలో గల నల్లచిన్నేపల్లె క్రాస్ వద్ద గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పుంగనూరు మండలం, నేతిగుట్లపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ(66) తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వస్తూ ఉండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఇతనిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటరమణ వెంకటరమణ గురువారం మృతి చెందాడు. అతని కుమారుడు మహేష్ ఫిర్యాదుపై ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుపై విరిగిపడ్డ చింతచెట్టు తప్పిన ప్రమాదం



రామసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం-చెంబకూరు రోడ్డు మార్గంలోని శనేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం చింతచెట్టు విరిగిపడింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనదారులు ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వంద ఏళ్లనాటి వృక్షం కావడం.... గత వారం రోజులుగా వర్షం పడుతుండటంతో మహావృక్షం చెట్టు కూలిపోయి రోడుపైకి వాలింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని చెట్టు కొమ్మలను తొలగించి వాహనాలు రాకపోకలు పునరుద్ధరించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రాయచోటిటౌన్/ ఖాజీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లోని పలు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడప విజిలెన్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, వ్యవసాయ అధికారులతో కలిసి కడప జిల్లాలోని ఖాజీపేట మండల కేంద్రంలో గల శ్రీలక్ష్మి గణేశ్ ట్రేడర్స్, శ్రీవెంకటేశ్వర రైతు ఏజెన్సీలతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని పీలేరు మండల కేంద్రంలో గల శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీ శ్రీనివాస ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తూకాల్లో తేడాలు, రికార్డుల్లో స్టాక్ వ్యత్యాసాలు, అధిక ధరలు అమ్మడం వంటివి గుర్తించారు. ఇందులో భాగంగానే మెట్రాలజీ యాక్ట్ అండ్ రూల్స్ 2009, 2011 ప్రకారం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ద్వారా రూ.1.50 లక్షలతో పాటు జీఎస్టీ యాక్ట్ ప్రకారం రూ.50వేలు జరిమానా విధించారు. అలాగే ఎఫ్‌సీఓ 1985, అర్బన్ సీ 28(1)(డీ) ప్రకారం వ్యవసాయ అధికారుల ద్వారా రికార్డుల్లో స్టాక్ వ్యత్యాసాలు ఉండడం వలన 23.25 మెట్రిక్ టన్నుల ఎరువులకు (రూ.4,75,370 విలువ గల) స్టాప్ సేల్స్ నోటీసులు జారీ చేశారు. స్టాక్ రికార్డులు స్వల్ప తేడాలు ఉన్నందునపై దుకాణ యజమానులకు అమ్మకం, నిలుపుదల నోటీసులు ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగుణంగా ఎరువులను, విత్తనాలను, పురుగు మందులను రైతులకు విక్రయించాలని, లేనిచో చర్యలు తప్పవని కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావుతో పాటు విజిలెన్స్ అధికారులు ఏవీ జవహర్‌రెడ్డి, డీఈఈ బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ విజయ్‌కిశోర్, ఏఈఈలు అశోక్‌కుమార్, ఖాజాహుస్సేన్, డీసీటీవోలు బాబు మోజెస్, రమేశ్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఖాజీపేట వ్యవసాయ అధికారి నాగార్జున, పీలేరు వ్యవసాయ అధికారిణి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఖాజీపేటలోని ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వృద్ధులపై యువకుడి వీరంగం...!

● ముగ్గురికి తీవ్ర రక్తగాయాలు

గుర్రంకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించి ఆరుగురు వృద్ధులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మర్రిమాకులపల్లెలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, బాధితుల వివరాల మేరకు మండలంలోని మర్రిమాకులపల్లెకు చెందిన జయరామిరెడ్డి కుమారుడు దిలీప్‌కుమార్‌రెడ్డి(25) చెడువ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో ప్రతి రోజు మద్యం సేవించి గ్రామంలో గొడవలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రచ్చబండ వద్ద కూర్చొని ఉన్న వృద్ధులపై మద్యం మత్తులో కర్రతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో రామలక్ష్మమ్మ(75), లక్ష్మమ్మ(80), హేమవతమ్మ(60)లకు కాళ్లు విరిగాయి. అలాగే ఈశ్వరమ్మ(50), ఎస్.లక్ష్మమ్మ(65), కత్తి లక్ష్మక్క(55)లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గాయపడిన వృద్ధులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడడంతో కాళ్లు విరిగిన వృద్ధులను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. యువకుడి వీరంగంతో గ్రామంలో ప్రజలు భయాందోళలనకు లోనయ్యారు. ఈవిషయాన్ని పోలీసులకు తెలపడంతో ఎస్‌ఐ రామచంద్రుడు యువకుడిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

మానవీయ విలువలతో కూడిన విద్య అవసరం

● వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మానవీయ విలువలతో కూడిన విద్య అవసరమని వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ తెలిపారు. శుక్రవార కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంపవరింగ్ యూత్ రోల్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్ అండ్ ప్రొఫెషనల్ ఎథిక్స్ ఫర్ బెటర్‌టుమారో అనే అంశంపై ఒక్కరోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మానవీయ విలువలు చాలా అవసరమని.. విలువలతో కూడుకున్న విద్యను కలిగి ఉన్నపుడే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులంతా తమ గురువులు చెప్పిన జ్ఞానాన్ని విలువలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. అమెరికా మిసిసిపి యూనివర్సిటీ నుంచి ఆన్‌లైన్ ద్వారా డాక్టర్ కల్లూరు రాజ మోహన్ మాట్లాడుతూ యువత కృషి పట్టుదల క్రమశిక్షణ కలిగి ఉన్నట్లయితే తాము అనుకున్న లక్ష్యాలను సకాలంలో సాధించడానికి వీలవుతుందన్నారు. అనంతరం ఆధ్యాత్మిక గురువు వరదానంద, ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాష, విశ్రాంత ప్రొఫెసర్ సత్తార్, వైవీయూ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, ప్రొఫెసర్ వినోదిని ప్రసంగించారు. అనంతరం అతిథులు సావనీర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ సుజాత, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



సావనీర్ విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

యూనివర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ కోఆర్డినేటర్‌గా సునీత

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైవీయూ భూగర్భశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వి.సునీతను యూనివర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్‌గా, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (ఆర్‌టీఐ)గా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అందజేశారు. ఈ స్థానంలో పనిచేస్తున్న కోఆర్డినేటర్ ఆచార్య గంగిరెడ్డి, పీఐఆర్‌టీఐపీఐఓపీ శివారెడ్డి పదవీకాలం పూర్తికావడంతో రిలీవ్ అయ్యారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం రామిరెడ్డిలేవుట్‌లో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.25,750 నగదును స్వాధీనం చేసుకొని.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు జూనియర్ కళాశాలలకు సెలవు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండో శనివారం సందర్భంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలకు సెలవు దినంగా ప్రకటించడమైందని ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడైన జూనియర్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తే ఇంటర్‌మీడియట్ బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం సమావేశం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఆర్‌ఐఎస్ జూనియర్ కళాశాలలో ఈనెల 15వ తేదీ ఉదయం 10గంటలకు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యం సమావేశం నర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.నరసింహులు ఒక ప్రకటనల తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు హాజరు కావాలని కోరారు.

ఎట్టకేలకు అటవీ అనుమతులు

● పునః ప్రారంభం కానున్న కమలాపురం బ్రిడ్జి పనులు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి హైవేపై కమలాపురం వద్ద నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులకు ఎట్టకేలకు అటవీ అనుమతులు లభించాయి. సుమారు మూడేళ్ల కిందట వచ్చిన వర్షాలతో కమలాపురం సమీప పాపాఘ్ని నదిపై వంతెన కుంగిపోయింది. దీంతో కొన్ని నెలలు పాటు రాకపోకలు ఆగిపోయాయి. వాహనాలు తిరిగే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో అధికారులు కుంగిన బ్రిడ్జిపైన కేవలం మనుషులు నడిచేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కొన్ని నెలలు పాటు ప్రజలు అవస్థలు పడ్డారు. ఎర్రగుంట్ల ప్రాంతంలో సిమెంటు, నాపరాయి పరిశ్రమలు ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డులో తిరిగేవి. అయితే బ్రిడ్జి కూలిపోవడంతో వాహనాల రాకపో కలకు అంతరాయం జరిగింది. కొన్ని నెలల తర్వాత నదిలో నీరు తగ్గడంతో అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. మరి కొంతకాలానికి అప్పటి ప్రభుత్వం నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంది. టెండర్లు నిర్వహించి బ్రిడ్జి పనులు చేపట్టారు.

అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు



అయితే బ్రిడ్జి నిర్మాణం రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో చేపట్టడంతో అటవీ అధికారులు పనులను నిలుపుదల చేయించారు. ఫలితంగా బ్రిడ్జి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఏళ్ల తరబడి అప్రోచ్ రోడ్డు వాహనాల రాకపోకలకు దిక్కు యింది. పనులు చేపట్టే ముందు సర్వే నిర్వహించి స్థల సేకరణలో బ్రేక్ పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం ఈనెల చివరి నాటికి బ్రిడ్జి పనులు పూర్తి కావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా బ్రిడ్జి నిర్మాణానికి అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారు. కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి వుండ డంతో కొంతవరకు జాప్యం ఏర్పడింది.

పుత్తా చొరవతో...

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కమలాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయన బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగి పోయి ప్రజలు అవస్థలు పడుతుండటం గమ నించి.. ప్రభుత్వ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసు కొచ్చి పనులు పునఃప్రారంభించేందుకు ప్రయత్నిం చారు. దీంతో పాటు ఆయన తండ్రి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరగా అటవీ అనుమతులు వచ్చేందుకు చొరవ చూపారు. దీంతో ఎట్టకేలకు అనుమతులు లభించాయి. మరికొన్ని రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాలున్నాయి. దీంతో బ్రిడ్జికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తయి రాకపోకలు కొనసాగే అవకాశాలున్నాయి.

బ్రిడ్జి పనులకు అనుమతులు వచ్చాయి

కమలాపురం రిజర్వు ఫారెస్ట్ పరిధిలో కమలాపురం సమీపంలోని నిర్మిస్తున్న బ్రిడ్జికి సంబంధించి అటవీ అనుమతులు లభించాయి. మరికొన్ని రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి.

- దివాకర్, ఇన్‌చార్జి జిల్లా అటవీశాఖ అధికారి.

రెవెన్యూ సదస్సుల్లో సమస్యలకు తక్షణ పరిష్కారం



పీరుమున్నీ, తహసీల్దారు

ఫేస్ టు ఫేస్

రాజంపేట,డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల పేరుతో గ్రామసభలు నిర్వహిస్తోంది. ప్రజలూ పెద్ద ఎత్తున పాల్గొని వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. ఈ సదస్సు ల దృష్టికి వస్తున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అధికారులు తీసుకుంటున్న చర్యలు రాజంపేటతహసీల్దారు పీరు మున్నీ ఆంధ్రజ్యోతికి వివరించారు

ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి వస్తున్న ప్రధాన సమస్యలు ?

జవాబు : భూముల ఆన్‌లైన్ వ్యవహారంపైనే ఎక్కువగా అర్జీలు అందు తున్నాయి. ఆ తర్వాత స్థానం రేషన్ కా ర్డులు, ఇంటి పట్టాలది. ప్రభుత్వ భూ ముల ఆక్రమణలపై ఫిర్యా దులు అందు తున్నాయి..

ప్రశ్న: ప్రభుత్వ భూముల కబ్జాలపై తీసుకుంటున్న చర్యలు?

జవాబు : గ్రామసభల్లో ప్రభుత్వ భూముల వివరాలను తెలుపుతున్నాం. ఆయా భూములను ఎవరైనా ఆక్రమించి ఉంటే తెలియజేయాలని ప్రకటిస్తున్నాం. ఫిర్యాదులు అందితే సర్వేకు ఆదేశాలిస్తున్నాం. నిర్ధారణ అయితే స్వాధీనం చేసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: కొత్తగా రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు ఇస్తున్నారా?

జవాబు : ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే అర్జీదారులకు ఇంటి స్థలాలను, పక్కా ఇళ్లు ఇస్తాం. రేషన్ కార్డులను తక్షణం మంజూరు చేస్తాం.

ప్రశ్న: రెవెన్యూ సదస్సులతో ప్రజలకు వెసులుబాటు ఏమిటి?

జవాబు : రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి అర్జీదారుల నుంచి ప్రభుత్వం కొంత మొత్తం వసూలు చేస్తుంది. కాని రెవెన్యూ సదస్సుల్లో అన్ని సమస్యలను ఉచితంగా పరిష్కరిస్తాం.

గుంతల రోడ్లలో ప్రయాణం.. అరచేతిలో ప్రాణం!

● అధ్వానంగా గ్రామీణ రహదారులు ● నిర్లక్ష్యం నీడలో ఐదేళ్లు ● బస్సు సర్వీసులు నిలిపివేసిన ఆర్టీసీ ● ప్రమాదాలబారిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లన్నీ అధ్వానంగా మారడంతో ఆయా రహదారుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్ల స్థితిగతులను పట్టించుకున్న పాపాన పోకపోవడంతో అవన్నీ ప్రస్తుతం కంకర తేలిపోయి, గోతులమయమై దర్శనమిస్తున్నాయని అంటున్నారు.



పాళెంగొల్లపల్లెకు వెళ్లే తారు రోడ్డు, (ఇన్‌సర్ట్) కంకర తేలిన అప్పకొండయ్యగారిపల్లె నుంచి కాలాడివాండ్లపల్లె వెళ్లే రోడ్డు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): .మండలంలో 16 గ్రామ పంచాయతీ లుండగా కొన్ని గ్రామాలకు తారు రోడ్లు, మరికొన్ని గ్రామాలకు మట్టి రోడ్లు ఉన్నాయి. ఐదేళ్లుగా ప్రభుత్వం ఈ రోడ్లను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం గోతులమయమయ్యాయి. కోనంపేట నుంచి పాళెంగొల్లలకు, చిన్నపోతులపల్లెకు, బుర్జుఎల్లె, నల్లగుట్టపల్లె, చంచర్లపల్లె, హరిజనవాడల మీదుగా గతంలో ఆర్టీసీ బస్సు నడిచేది. అయితే, రోడ్డు అధ్వానంగా మారడంతో ఆర్టీసీ సర్వీసు నిలిపి వేసింది. లక్కిరెడ్డిపల్లె నుంచి కస్తూరిరాజు గారిపల్లె, గురయ్యగారిపల్లె, సిద్దకవాండ్లపల్లె, ఎగువబత్తెనపల్లె, దిగువబత్తెనపల్లె, వాయిల్‌రాజు గారి పల్లె నుంచి రాయచోటికి వెళ్లే రోడ్డులో కూడా కంకర తేలి గుంతలు దర్శనమిస్తున్నాయి ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే ఆటోలు, ద్విచక్రవాహనాలు ఎన్నో సార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. .లక్కిరెడ్డిపల్లె నుంచి కాలాడివాండ్లపల్లెకు వెళ్లే మార్గం నరకాన్ని తలపిస్తోంది 2018లో రూ. 45 లక్షలతో ఈ రోడ్డు పనులు ప్రారంభించారు 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులను నిలిపివేశారు. ఆ తర్వాత ఎవరూ ఈ రోడ్డును పట్టించుకోలేదు. దీంతో కొనసానివారిపల్లె, కాలాడివాండ్లపల్లె, ఎర్రప్పనగారి పల్లె గ్రామస్తులు నరకం అనుభవిస్తున్నారు. కోనంపేట నుంచి గాలివీడు మార్గంలోని హరిజన వాడ, గల్లావాండ్లపల్లె, వేములవాండ్లపల్లె, గొల్లపల్లె రోడ్లలో అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. చిన్నపల్లెకు వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా అంతే.

ఈ పరిస్థితుల్లో సంక్రాతి పండుగలోపు ఈ రోడ్లన్నింటికీ మరమ్మతులు చేయిస్తామని ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకునే పరిస్థితులు కనిపించడం లేదు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని వాహనాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే రోడ్డైనా బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం

● కలెక్టరేట్ వద్ద వైసీపీ నేతల ఆందోళన



ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్),డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతను దగా చేస్తున్న కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం వైసీపీ కార్యకర్తలు, నాయకులు, రైతులు కలెక్టరేట్ గేట్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు విడుదల చేయాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లి ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మదనపల్లె మున్సిపల్ చైర్మన్ మనూజతో పాటు జిల్లా వ్యాప్తంగా వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతు సమస్యలపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు


చిట్వేలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలపై మాట్లాడే అర్హత, నైతిక హక్కు వైసీపీకి లేదని చిట్వేలి జనసేన నాయకుడు మాదాసు నరసింహ అన్నారు. శుక్రవారం స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమను ఎక్కడ మరచిపోతారోనన్న భయంతో టైంపాస్ రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

ఆరు నెలలకే వైసీపీలో వణుకు

సిద్దవటం: కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో ప్రైవేటు రంగ సంస్థలో లక్షలాది ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించి యువతకు కొండంత అండగా నిలిచిందని జనసేన నేత అతికారి కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని చాముండేశ్వరిపేట వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ నేతలు చేసిన మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని,తమ మోసాలు ఎక్కడ బయటపడతాయోనని కబ్జాలకు పాల్పడిన రైతు సదస్సుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు.

విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలు ఆపాలి

రాయచోటిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపడంతో పాటు ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట నేషనల్ కోఆర్డినేటర్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు అడుగులు వేస్తున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ మీటర్లను అమర్చడం అందులోని భాగమేనన్నారు. ఇదే పరిస్థితి భవిష్యత్‌లో కొనసాగితే అటు రైతులకు, ఇటు సామాన్య ప్రజలకు, సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మిక వర్గానికి చాలా నష్టం జరుగుతుందన్నారు. డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్థను ప్రైవేట్ వారికి అప్పజెప్పే ప్రయత్నం ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు.



బీజేపీ బలోపేతానికే బూత్ కమిటీ ఎన్నికలు



శంకరమ్మను అభినందిస్తున్న సాయిలోకేష్

రాజంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతానికే బూత్‌కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు రాజంపేట మండలం ములక్కాయలపల్లెలో శుక్రవారం బూత్‌కమిటీ ఎన్నికలు నిర్వహించి అధ్యక్షురాలిగా శంకరమ్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకునే వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.. ఇందులో భాగంగా బూత్‌కమిటీ సభ్యులను, కార్యవర్గాన్ని ఎంపిక చేస్తున్నామన్నారు. ప్రభావతి, సురేష్‌రాజు, కృష్ణయాదవ్, రమణయ్య, నాగరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరమ్మను సత్కరించారు.

కంబాలకుంటలో ఉచిత వైద్యశిబిరం

పెనగలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంబాలకుంట బీసీ కాలనీలోని రామాలయం వద్ద టీడీపీ, బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి మారంరెడ్డి శివయ్య, మాజీ సర్పంచ్ ఎం.లక్ష్మీనరసయ్య, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దాదాపు వంద మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు. గ్రామ పెద్దలు ఎం.నరసింహ, జనసేన మండల కార్యదర్శి గొబ్బూరు హరిరాయల్, జి.ఈశ్వరయ్య, బోయన ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం పనుల అడ్డగింత

రాజంపేట టౌను, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి పనులను అధికారులు అడ్డుకున్నారు. పులపత్తూరుకు చెందిన సాంబయ్య అనే వ్యక్తి ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నాడంటూ స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు పనులను అడ్డుకున్నారు. సర్పంచ్ తనయుడు జగన్‌మోహన్ రెడ్డే ఇందుకు కారణమంటూ సాంబయ్య నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ విషయమై తహసీల్దారు పీర్‌మున్నీ మాట్లాడుతూ గతంలో అతనిని మూడుసార్లు హెచ్చరించామన్నారు. సీఐ మహ్మద్‌అలీని మాట్లాడుతూ అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

విశ్వేశ్వరయ్యస్వామికి జ్యోతిష శిరోమణి అవార్డు

సంబేపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జ్యోతిషంలో నైపుణ్యం కనబరచినందుకు తిరుమల తిరుపతి దేవస్థానం జ్యోతిష శిరోమణి అవార్డుతో సత్కరించిందని సుండు పల్లె మండలం చిన్నగొల్లపల్లి పాతజంగంపల్లికి చెందిన టీ. విశ్వేశ్వరయ్య స్వామి తెలిపారు. ఈ నెల 11న తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన సెమినార్‌లో నైపుణ్యం ప్రదర్శించడంతో ఈ అవార్డును అందించినట్లు తెలిపారు.

ఖాజాబీ మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

రాయచోటిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):పాతరాయచోటిలోని అంగన్వాడీ సెంటర్‌లో 35 ఏళ్లుగా వర్కర్‌గా పనిచేసిన ఖాజాబీ తీవ్ర అనారోగ్యంతో గురువారం మరణించారని, ఆమె మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు తెలిపారు. బసిరెడ్డిగారి పల్లెలో జరిగిన ఆమె అంత్యక్రియలకు అంగన్వాడీ, సీఐటీయూ, సీపీఎం నాయకులు హాజరై వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.



ఏకగ్రీవం దిశగా సాగునీటి సంఘాల ఎన్నికలు !

పెనగలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం జరగనున్న 15 సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధ్యక్ష, ఉపాధ్యక్ష సభ్యుల ఎన్నిక దాదాపు ఏకగ్రీవం కానుండగా, ఒకటి రెండు చోట్ల మాత్రమే ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. ఎనగలూరు, ఇండ్లూరు సిద్దవరం, సింగారెడ్డిపల్లె, నల్లపురెడ్డిపల్లె, ఓబిలి, వెలగచర్ల, గోవిందంపల్లెకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి వద్దకు వెళ్లి తమ అనుచరుల జాబితాను ఆయనకు ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శనివారం లాంఛన ప్రాయంగా ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది.

రాజంపేట టీడీపీ కార్యాలయం కిటకిట



సుగవాసితో చర్చిస్తున్న పలువురు నాయకులు

రాజంపేట: సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ కార్యాలయం కిటకిటలాడింది. మన్నూరు, ఊటుకూరు, పోలి, మందపల్లె, హస్తవరం, తాళ్లపాక చెరువు సంఘాల ఎన్నికలపై ఆయా గ్రామాల రైతులు నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఇరిగేషన్ డీఈ మురళీకృష్ణతో చర్చించారు. నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ఏ అంశాలను పరిగణలోకి తీసుకోవద్దన్నారు.

గుంజనేటికి మళ్లీ వరద

పెనగలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గుంజనేటికి మళ్లీ వరద వచ్చింది. వర్షాల కారణంగా శుక్రవారం ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు వరదను చూసేందుకు తండోపతండాలుగా గుంజనేటి వద్దకు వెళ్లారు.

గ్రామీణాభివృద్ధితోనే దేశాభివృద్ధి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెంది తేనే దేశం అభివృద్ధి చెం దుతుందని లోకలైజేషన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర పరిశీలకురాలు భార్గవి తెలిపారు శుక్ర వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో పంచాయతీ కార్య దర్శులు గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలిం చాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. సామాజిక, జీవనవిధానాలను మెరుగుపరుచుకోవాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. అక్షరాస్యత అవశ్యతను వివరించి ప్రతి ఒక్కరు చదువుకునేట్లు చూడాలన్నారు. సర్వేల ద్వారా నిరుపేదలను గుర్తించి వారి సుస్థిర ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెయ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ సిద్దయ్య, అంగన్ వాడీ సూపర్‌వైజర్ తులసమ్మ, హిమామ్, జయశ్రీ, నాగమణి, మల్లికార్జున, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి); రెవె న్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కరించుకో వచ్చుని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం దిన్నెపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. జనవరి 8 నుంచి నిర్వహిస్తున్న మీ భూమి మీ హక్కు కార్యక్రమం ద్వారా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్ మోహన్, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకారపు జయరామ్, సిద్దక వెంకటరామిరెడ్డి, ధర్మరాజు, ఓబులేసు రెవెన్యూ ,సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నందలూరు అభివృద్ధికి సహకరించండి



పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న నాగోతు రమేశ్ నాయుడు తదితరులు

నందలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నందలూరు అభివృద్ధికి సహకరించాలని బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిని ఢిల్లీ లోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు శుక్రవారం తెలిపారు. తాను త్వరలో రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌తోను, రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో మాట్లాడి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు షబ్బీర్‌అహ్మద్, పోతురాజు మస్తానయ్య, హిమగిరినాథ్‌యాదవ్, టీడీపీ నాయకులు మోడపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి ప్రహరీగోడ నిర్మించాలి

రాయచోటిటౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుపత్రికి పడమర భాగంలో ఉన్న ప్రహరీగోడ కూలి రోడ్డు మీద పడడంతో బస్సులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, మట్టి, ఇసుక దిబ్బలు తొలగించి వెంటనే గోడ నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కూలిన గోడను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తై ఏడాది దాటినా వెనుక రక్షణ గోడ కట్టకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆసుపత్రిలోని ఇనుప వస్తువులు గేట్లు, మోటార్లు ఇంకా విలువైన వస్తువులు కూడా వెనుక దారిన పోవడానికి అవకాశం ఉందని తెలిపారు. వడ్డెర విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీ శంకర్ మాట్లాడుతూ గోడ లేనందున దొంగలతో పాటు తాగుబోతులు, పం దులకు అడ్డాగా మారుతోందన్నారు. గైనిక్ విభాగానికి చెందిన కాంప్లెక్స్ గోడలు వర్షానికి దెబ్బతింటున్నాయని, మరో దఫా గోడలకు ప్లాస్టరింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి మాధవయ్య, రెడ్డెయ్య, ఖాదర్‌వలి, రైతులు పామయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపంపై సమావేశం

సిద్దవటం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపంపై పోలీసు బెటాలియన్ పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించినట్లు విద్యాకమిటీ ఛైర్మన్ హరికృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపంపై రాతపూర్వకంగా తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించామన్నారు. ఈ సమావేశానికి 16 మంది హాజరు కాగా, వంట ఏజెన్సీని మార్చాలని 14 మంది అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. ఈ విషయమై స్కూల్ హెడ్మాస్టర్ నాగ మునిరెడ్డి మాట్లాడుతూ వంట ఏజెన్సీ వారికి ఈ విషయం తెలియపరుస్తామని తెలిపారు.

'రెవెన్యూ సదస్సులు ఒక మాయాజాలం'

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 13, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఒక మాయాజాలం అని టీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు కేవలం బడా నాయకులు, కబ్జాదారులు, పెత్తందారుల కోసమేనని నిరుపేద దళిత, గిరిజనులకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎం.జయరామయ్య, ఉపాధ్యక్షులు ఎం.రమణయ్య పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సొమ్ము అప్పగింత

రాయచోటిటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఆర్టీసీ బస్టాండులోని ఏపీఎస్ ఆర్టీసీ కంట్రోల్‌లో పాయింట్‌లో పనిచేస్తున్న ప్రైవేట్ కంట్రోలర్ రోషిణి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే... గొట్టివీడుకు చెందిన శివారెడ్డి అనే ప్రయాణికుడు రూ.2500 నగదుతో పాటు అతని బస్సు పాసు కార్డులు బస్‌లో మరిచిపోయి బస్సు దిగి వెళ్లిపోయాడు. అయితే అదే బస్ ఎక్కిన మరో ప్రయాణికుడు నగదుతో పాటు బస్‌పాస్‌ను బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కంట్రోలర్ రోషిణికి తెచ్చి ఇవ్వడంతో ఆ కార్డులోని సెల్ నెంబర్ ఆధారంగా ప్రయాణికుడిని బస్టాండుకు పిలిపించి అతను పోగొట్టుకున్న డబ్బు, బస్సు పాసును అతనికి అందజేశారు. దీంతో ఆర్టీసీ డీఎంతో పాటు ఆర్ఎంలు ప్రైవేటు కంట్రోలర్ రోషిణిని అభినందించారు.

అయ్యప్ప భక్తులకు ముస్లింల అన్నదానం



అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన నిజాముద్దీన్, అమీన్ తదితరులు

గాలివీడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తులకు ముస్లింలు భిక్ష ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు.మండల కేంద్రంలోని గేటు వద్దనున్న శ్రీరామాలయంలో అమీర్ టీవీఎస్ షోరూం యజమాని ఎస్ కే నిజాముద్దీన్, అమీన్ మెడికల్ స్టోర్ యజమాని అమీన్ శుక్రవారం అయ్యప్ప భక్తులకు స్వయంగా వడ్డించారు. అనంతరం వారు కూడా అక్కడే భిక్ష చేశారు కొన్నేళ్లుగా శబరిమలకి వెళ్లే అయ్యప్ప భక్తులకు మెడికల్ కిట్లు, పండ్లు పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు

గాలివీడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు శుక్రవారం శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. స్థానిక శ్రీకోదండస్వామి రామాలయంలో గురుస్వామి రామిరెడ్డి ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్వాములకు కానుకలు ఇచ్చారు. అనంతరం ప్రత్యేక బస్సులో శబరికి తరలివెళ్లారు.

బండలాగుడు పోటీలు

నందలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హజరత్‌ఖాదర్‌వలి దర్గా ఉరుసు సందర్భంగా గురువారం రాత్రి స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో బండలాగుడు పోటీలను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ మెంబర్లు ఆయనను శాలువతో సత్కరించారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి టంగుటూరు ఉరుసు ప్రతీక అన్నారు.

ఆధ్యాత్మిక, ఆరోగ్య, పర్యావరణ పర్యాటకంతో అపార అవకాశాలు



సెమినార్ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మిల్టన్

పీలేరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జీవ, భౌగోళిక వైవిధ్యం ఎక్కువగా ఉన్న మన దేశంలో ఆధ్యాత్మిక, ఆరోగ్య, పర్యావరణ రంగాలతో పర్యాటక రంగాన్ని అనుసంధానం చేస్తే యువతకు అపార ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెన్నైలోని సవిత విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ మిల్టన్ అన్నారు. 'పర్యావరణ పర్యాటకం-సుస్థిరాభివృద్ధి' అంశంపై శుక్రవారం స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ సెమినార్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్లోబలైజేషన్ కారణంగా దేశంలో సాహస క్రీడలు చేసే వారు, ప్రకృతి ప్రేమికులు, పర్యటనలపై ఔత్సాహికుల సంఖ్య పెరిగిందన్నారు. పర్యావరణ పర్యాటకంతో కేవలం ఆర్థికాభివృద్ధి మాత్రమే కాకుండా పర్యావరణ అవగాహన, అభివృద్ధి, పరిరక్షణ కోణాలను ఆవిష్కరించేలా ప్రభుత్వాలు విధానాలు రూపొందించుకోవాలన్నారు. పర్యాటక ప్రదేశాలను గుర్తించడమే కాకుండా వాటిని అభివృద్ధి చేసి పెద్దఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. బెంగళూరులోని గార్డెన్ సిటీ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ సుమిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగంలో పరిశోధన అధ్యయనాలు ఊపందుకున్నాయని, వాటి ఫలాలను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వాలు చురుగ్గా వ్యవహరించాలన్నారు. కళాశాల స్థాయి నుంచి పర్యాటక రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే వారు అపారమైన అవకాశాలు అందిపుచ్చుకోగలరన్నారు. కళాశాల వైస్-ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, సదస్సు సమన్వయకర్త డాక్టర్ వెంకటరమణయ్య, గుల్బర్గా కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు గంగినేని రంగనాథం, డిగ్రీ కళాశాల అధ్యాపకులు సంధ్యా ఆదూరి, రఫీ, ఖాదర్ బాషా, ప్రశాంత, వివిధ వర్సిటీల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం తరలింపు

కలికిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఉన్న డిప్యూటీ జిల్లా మెడికల్, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని కుప్పం తరలిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ అనుమతులు కూడా పొందినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు శుక్రవారం జీఓ నంబరు 155 జారీ చేశారు. కాగా మదనపల్లెను జిల్లా కేంద్రం చేయాలన్న ప్రజల డిమాండుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తమవుతున్న నేపథ్యంలో అక్కడ ఏకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉన్నందున ప్రస్తుత డిప్యూటీ ఎంహెచ్ఓ కార్యాలయం అవసరం వుండదన్న ఉద్దేశంతో ఈ కార్యాలయాన్ని కుప్పంకు తరలిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెపుతున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కడపరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి కడప జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో 20 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 2, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టుల్లో ఒక్కొక్క బెంచ్ ఏర్పాటు చేశామన్నారు. రాజంపేటలోని మూడవ అదనపు జిల్లా కోర్టుకు సంబంధించిన కేసులను కడప నాల్గవ అదనపు జిల్లా కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే రైల్వేకోడూరు కోర్టుకు సంబంధించిన కేసులు రాజంపేట ఏడీఎం కోర్టు బెంచ్‌లో, సిద్దవటం కోర్టుకు సంబంధించిన కేసులు బద్వేల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులు తమ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందాలని సూచించారు.

రిమాండ్‌కు వైసీపీ కార్యకర్త సుధారాణి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమార్తెపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన నిందితురాలు, వైసీపీ కార్యకర్త సుధారాణిని రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గత నెల 1వ తేదీన మదనపల్లెకు చెందిన జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం మదనపల్లె టూటౌన్‌లో ఈమెపై ఫిర్యాదు చేశారు. దీంతో గుంటూరు జిల్లా నరసారావుపేటకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణి (32) నిర్వహిస్తున్న రెడ్డిగారి అమ్మాయి, రెడ్డి 2022 సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కుమార్తెలపై పోస్టులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే గుంటూరులో అరెస్టు చేశారు. గురువారం రాత్రి ఆమెను పీటీ వారెంట్‌పై గుంటూరు నుంచి మదనపల్లెకు పోలీసులు తీసువచ్చి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం నిందితురాలను మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచి తిరిగి గుంటూరుకు రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.



బ్రౌన్ శాస్త్రి.. జానమద్ది

తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం ● నేడు జానమద్ది శతజయంతి స్మారకోపన్యాసం

స్మారక ఉపన్యాస పరంపర వేడుకలు ● హాజరుకానున్న విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు సూర్యుడు సీపీబ్రౌన్, ప్రముఖ సాహితీవేత్త జానమద్ది హనుమశాస్త్రి కలగలిసిన పరిశోధన కేంద్రమే సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం. అది గ్రంథాలయమే కాదు ఎన్నో గ్రంథాల సంపుటాలు, చరిత్రకు అందించే సంక్షిప్త వివరాలు, విరబూసిన సాహితీ కుసుమాల సమాహారంగా నిలిచింది. కడప పట్టణంలో సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం నెలకొల్పి నిరంతరం శ్రమించి ఎన్నో సాహితీ కార్యక్రమాలను నిర్వహించి తెలుగునాట బహుముఖ సాహితీవేత్త, విశ్వంభర గ్రంథకర్త, డాక్టర్ సి.నారాయణరెడ్డిచే బ్రౌన్ శాస్త్రిగా గౌరవించబడ్డారు జానమద్ది హనుమశాస్త్రి. గ్రంథాలయాన్ని నిర్మించి తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం కల్పించిన మహోన్నతులు డాక్టర్ జానమద్ది శతజయంత్యుత్సవాలు శనివారం వేడుకగా నిర్వహించనున్నారు. వివరాల్లోకెళితే...

రాష్ట్రంలో అత్యంత వెనకబడిన అనంతపురం జిల్లా రాయదుర్గం వాసులు జానకమ్మ, సుబ్రమణ్యశాస్త్రి పుణ్యదంపతుల ముద్దుల పట్టి జానమద్ది హనుమశాస్త్రి 1925 అక్టోబరు 20న జన్మించారు. రాయదుర్గం జిల్లా బోర్డు హైస్కూల్లో ఎస్ఎస్ఎల్సీ వరకు చదుకుంటూనే ప్రైవేట్‌గా బీఏ, బీఎడ్ పూర్తిచేశారు. పట్టుదలతో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రావీణ్యం సాధించారు. అంతేకాకుండా తెలుగు ఆంగ్ల భాషల్లో ఎంఏ పట్టా సాధించారు. తర్వాత బళ్లారిలోని ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా ఉద్యోగ ప్రస్థానం ఆరంభించారు. జానమద్ది శాస్త్రి కథా రచయితగానే కాకుండా వివిధ పత్రికలకు 2500పైగా వ్యాసాలు, 16 గ్రంథాలు రాశారు. సీపీ బ్రౌన్ మీద పరిశోధన చేశారు. ఫలితంగా కడప పట్టణంలో సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం నెలకొల్పి నిరంతరం శ్రమించి పరిశోధన కేంద్రం స్థాయికి తీసుకెళ్లారు. సాహిత్యంలో పట్టున్న ఆయన ఎన్నో సాహితీ కార్యక్రమాల ద్వారా ఎందరో సాహితీ ప్రముఖులను ఆహ్వానించారు. ఆయన శ్రమను గుర్తించిన తెలుగునాట బహుముఖ సాహితీవేత్త, విశ్వంభర గ్రంథకర్త, డాక్టర్ సి.నారాయణరెడ్డిచే బ్రౌన్ శాస్త్రిగా గౌరవించారు. ఎంతో చరిత్ర కలిగి సదాస్మరణీయ పండితులుగా ఖ్యాతి దక్కించుకున్న జానమద్ది తెలుగువారి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. బ్రౌన్ గ్రంథాలయం కోసం నిరంతరం శ్రమించిన ఆయన 2014 ఫిబ్రవరి 28న తుదిశ్వాస విడిచారు. అందరికీ జానమద్ది, ఎందరికో జ్ఞానమద్దియని, బ్రౌన్ గ్రంథాలయ భవనానికి నిలువెత్తు ద్వారమై నిలిచారని ప్రశంసలు అందుకున్న మహోన్నత సాహితీవేత్త. స్ఫూర్తి ప్రదాత జానమద్ది సాహితీ సేవలు సదాస్మరణీయం.

సాహితీ సేవలు

కడపలో సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ ట్రస్టును నెలకొల్పి కార్యదర్శిగా ఉంటూ అహర్నిశలు శ్రమించి రూ.10లక్షల విరాళాలు సేకరించారు. ఈ కేంద్రానికి 15వేల గ్రంథాలను శాస్త్రి సేకరించి బ్రౌన్ ద్విశతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించి బ్రౌన్ శాస్త్రిగా పేరుగాంచారు. 1973లో కడప జిల్లా రచయితల సంఘం స్థాపించి 20ఏళ్లు కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్రంలోని సుప్రసిద్ధ రచయితలను కడప జిల్లాకు పరిచయం చేశారు. బెజవాడ గోపాలరెడ్డి, ఆరుద్ర, దాశరథి, కుందుర్తి, పురిపండా అప్పలస్వామి, శ్రీశ్రీ, సి.నా.రె., దేవులపల్లి రామానుజరావు, దివాకర్ల వెంకటావధాని వంటి రచయితలను కడప జిల్లాకు ఆహ్వానించి చక్కని కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

ప్రముఖ గ్రంథ రచనలు

మా సీమకవులు, నాట్యకళా ప్రపూర్ణ బళ్లారి రాఘవ (జీవిత చరిత్ర), కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం, కడప సంస్కృతి-దర్శనీయ స్థలాలు, మన దేవతలు, భారతరత్నం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత చరిత్ర, సీపీ బ్రౌన్ చరిత్ర, మొండి గోడల నుంచి మహాసౌధం దాకా, విదురుడు, త్యాగమూర్తుల మనిషి, నీకు అసాధ్యమేదీ, ఎందరో మహాద్భావులు, భారత మహిళ, శంకరంబాడి సుందరాచారి, పురస్కారాలు, సత్కారాలు అనేక అవార్డులు లభించాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి గౌర డాక్టరేట్, లోకనాయర్ ఫౌండేషన్ సాహితీ పురస్కారం, (2011) గుంటూరులో అయ్యంకి వెంకటరమణయ్య అవార్డు, అనంతపురం లలిత కళా పరిషత్ అవార్డు, ధర్మవరం కళాజ్యోతి వారి సిరిని ఆంజనేయులు అవార్డు, కడప సవేరా ఆర్ట్స్ వారి సాహితీ ప్రపూర్ణ అవార్డు, మదనపల్లె భరతముని కళారత్న అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, బెంగుళూరులో అఖిల భారత గ్రంథాలయ మహాసభ పురస్కారం, ఉడిపి పెజావరు పీఠాధిపతిచే ధార్మికరత్న బిరుదు మొదలైనవి సాధించారు.



సీపీ బ్రౌన్ గ్రంథాలయం ఇన్‌సెట్‌లో జానమద్ది కాంస్య విగ్రహం

హాజరు కానున్న జస్టిస్ ఎన్వీ రమణ

కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం జానమద్ది శతజయంతి స్మారక ఉపన్యాస పరంపరలో భాగంగా తెలుగు భాషా వైభవం పేరిట జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ హాజరు కానున్నట్లు జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ తదితరులు పాల్గొంటారన్నారు.

నేటి నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు

● 35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ● 175 మంది పోలీసులతో బందోబస్తు

కాశినాయన డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): వరికుంట్ల సమీప జ్యోతి క్షేత్రంలో కాశిరెడ్డినాయన 29వ ఆరాధనోత్సవాలు శనివారం నుంచి వేడుకగా ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజులు నిర్వహించే ఉత్సవాల్లో మొదటిరోజు గణపతి పూజతో ప్రారంభమై హోమాలు, కాశినాయన పాలరాతి సమాధికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రికి జ్యోతి ప్రజ్వలన, రథోత్సవం ఉంటుంది. 15న కాశినాయన యోగ సమాధికి అభిషేకం, రాత్రి నిర్వహించే పల్లకి ఉత్సవంతో ఆరాధనోత్సవం ముగుస్తుంది.



కాశినాయన కాంస్య విగ్రహం - విద్యుత్ దీపాలంకరణలో ఆలయం ముఖ ద్వారం

విద్యుత్ దీపాలతో ఆలయం ముస్తాబు

కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాల కోసం ఆలయం ముస్తాబు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీనరసింహ స్వామి, గరుడుడు, హనుమంతుల వారి ముఖాలను ముస్తాబు చేసి ఆలయం ముందు భాగం ప్రవేశ ద్వారం ముస్తాబు చేశారు.



అన్నదానం కోసం భక్తులు ఇచ్చిన కూరగాయలు

35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

కర్నూలు, గుంటూరు, ఒంగోలు జిల్లాల నుంచి కాశినాయన ఆరాధకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గిద్దలూరు బస్టాండు, రైల్వేస్టేషన్ నుంచి 15 ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు గిద్దలూరు డిపోమేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. కడప జిల్లాలోని మైదుకూరు, పోరుమామిళ్ల, బ్రహ్మంగారి మఠం నుంచి 20 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు మైదుకూరు సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయమ్మ తెలిపారు. 14వ తేదీ ఉదయం నుంచి 15 వతేదీ రాత్రివరకు ఈసర్వీసులు నిరంతరం నడుస్తాయన్నారు.

175 మంది పోలీసులతో బందోబస్తు

కాశినాయన ఆరాధన కోసం మైదుకూరు డీఎస్పీ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు అధ్యక్షతన 175 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ముగ్గురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, 149 మంది పోలీసులు, 15 మహిళా పోలీసులు విధుల్లో ఉంటారన్నారు.

పత్తూరులో ఉత్సవాలు

ఖాజీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు పత్తూరులో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వేకువజాము నుంచే మహాగణపతి, అన్నపూర్ణాదేవి, నవగ్రహాలకు, కాశిరెడ్డినాయన మూలవిరాట్టుకు అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం చెక్కభజన (కులుకు), సాయంత్రం కోలాటాలు, రాత్రి భక్త చింతామణి, ఆదివారం ఉదయం 7 గంటలకు స్వామివారికి మహానైవేద్యం, 10 గంటల నుంచి హరినామ తాళభజన నిర్వహిస్తారని కమిటీ తెలిపింది. విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు వివరించారు. భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు భారీ ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు.

బండలాగుడు పోటీలు


కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు పురస్కరించుకుని వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు, 6వ బహుమతి రూ.5 వేలు చెల్లించనున్నారు. కాగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా గట్టి బందోబసు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.



ముస్తాబైన వీఎన్‌పల్లెలోని కాశినాయన ఆలయం

వీరపునాయునిపల్లె: మహిమాన్వితుడు అన్నదాన ప్రభువు అనునిత్యం భక్తుల నోట పిలవడమే అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో ఆరాధన ఉత్సవాలకు ముస్తాబైంది. మండలంలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద నున్న కాశినాయన 29వ ఆరాధన జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 15వ తేదీన ఆదివారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భజన కార్యక్రమాలు, సంకీర్తనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు మెరవణి నిర్వహించడం జరుగుతుందన్నారు. అమ్మఒడి చారటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. లాగే న్యాకేటగిరి రాష్ట్రస్థాయి విభాగంలో బండలాగుడు పోటీలు జరుగుతాయని చెప్పారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

డాక్టరు రమేష్‌బాబుపై డీఎంహెచ్ఓ విచారణ



ఆస్పత్రిలో విచారణ చేపడుతున్న డీఎంహెచ్ఓ

నిమ్మనపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారిగా పని చేస్తున్న రమేష్‌బాబుపై శుక్రవారం అన్నమయ్య జిల్లా డీఎంఅహెచ్ఓ కొండయ్య విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ నాగేంద్రబాబు సీఎం పేషీకి డాక్టరు రమేష్‌బాబుపై ఉన్నతాధికారుల అనుమతి లేకుండా జీతం నిలిపివేయడం, అటెండెన్స్ ఇవ్వక పోవడం, ఎఫ్ఆర్ఎస్ కట్‌చేసి సరెండర్ చేయండంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో సిబ్బంది, డాక్టరును విచారించి దీనిపై పూర్తి వివరాలను ఉన్నతాధిరులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే నాగేంద్రబాబు గతంలో డీఎంహెచ్ఓకు తాను ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోక పోవడంతో సీఎం పేషీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం డీఎంహెచ్ఓ కొండయ్య రికార్డులను పరిశీలించి సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు.

వ్యవసాయం ఆయన ఉద్యోగం



ఆశాజనకంగా కనపడుతున్న చీనీ చెట్లు

నోరు ఎర్రన.. బతుకు పచ్చన.... ● కడుపు నింపే కొత్త వరివంగడాలు

సంప్రదాయ ఎరువులతో సాగు ● పంటల సాగుతో ఆకట్టుకుంటున్న రైతు

దువ్వూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం అనేక రకాల పనులను చేస్తుంటా రు. కొందరు ఉద్యోగం, మరికొందరు చేతి వృత్తులు, మరికొందరు సొంత పనులు, వ్యాపారం, గ్రామాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇందులో జీవన భృతి కోసం మొదట ఎంచుకునేది ఉద్యోగం. చిన్న ఉద్యోగమైనా నెల తిరిగేలోపు జీతం వస్తుందని, జీవితానికి భరోసాగా ఉంటుంది. దీంతో గ్రామాలను సైతం వదిలేసి పట్టణాల్లో ఉద్యోగాలకు, చేతి వృత్తులు, సొంత వ్యాపారం చేసుకుంటుంటారు. అయితే ఇక్కడ ఒక రైతు వ్యవసాయమే ఉద్యోగంగా ఎంచుకుని జీతం కంటే అధికంగా ఆర్జిస్తున్నారు. మొక్కుబడి వ్యవసాయం చేయకుండా నేల సార వంతాన్ని గమనిస్తూ సంప్రదాయ ఎరువులు, మందులు వినియోగిస్తూ భూమి పోషక విలువలను అందిస్తూ పంటలో పట్టుసాధిస్తున్నారు బండి చలపతి చేస్తున్న ఉద్యోగం వివరాల్లోకెళితే....



తమలపాకుల తోట

దువ్వూరు మండలం రాంసాయినగర్ వాసి రైతు బండి చలపతి అందరికీ భిన్నంగా పంటలసాగుకు పూనుకుంటున్నారు. చిన్నప్పటి నుంచే వ్యవసాయాన్ని ప్రాణంగా చేస్తున్నాడు. 35 ఏళ్లగా వ్యవసాయం అనే ఉద్యోగం చేస్తున్నారు. ఫలితం గా ఉద్యోగులకంటే ఎక్కువగా ఆర్జిస్తున్నారు. రసా యనిక ఎరువులు, పురుగుల మందులను వినియోగించకుండా సంప్రదాయ ఎరువులు, కషా యాలను వాడుతున్నారు. ఆవుల ద్వారా ద్రవ, ఘన జీవామృతాలు, సొంతంగా తయారు చేసుకున్న కషాయాలను వాడుతూ ఇతర రైతులను కూడా చైతన్య పరుస్తుంటారు. వ్యవసాయం మొక్కుబడిగా చేయరాదని, పంటల మార్పిడితో ఆశాజకంగా దిగుబడి వస్తుందని, విచక్షణా రహితంగా పురుగు మందుల వాడకం, రసాయనిక ఎరువులు చల్లడం మంచిది కాదని ఆయన రైతులకు వివరిస్తుంటారు. తినే పంటలో కూడా అవే విషపదార్థాలు తయారై మానవుని జీవన ప్రమాణాన్ని తగ్గిస్తుందని, అంతేకాకుండా నేల సారవంతం తగ్గిపోయి, భూమికి తగిన పోషక విలువలు తగ్గిపోతాయని, ఫలితంగా రైతులు సాగులో పట్టు కోల్పోతూ నష్టాలు చవిచూస్తుంటారని పలు సందర్భాల్లో రైతులకు వివరిస్తుంటారాయన. దీం తో ఆప్రాంతంలో చలపతి గురించి తెలియనివారుండరనడం అతిశయోక్తి కాదు. ఆయనకున్న 15 ఎకరాలకు తోడు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటల సాగు చేపట్టారు. ప్రస్తుతం తమలపాకు, పసుపు, చీనీ చెట్లు ఈ ప్రాంతంలో ఎవరూ సాగు చేయని వరి వంగడాలు వేశారు. రత్నచూడు, బహురూటి, చిట్టిముత్యాలు వంటి కొత్త వంగడాలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పిం చి వరి పంటను సాగు చేశారు. మన ప్రాంతంలో వరి ధాన్యం రేటు కంటే బస్తాపై వెయ్యి నుంచి రూ.1500 అధిక రేటు పలుకుతాయి. ఈ గింజలకు సంబంధించిన రైస్‌ను షుగర్ పేషెంట్లు కూడా తినవచ్చని రైతు చలపతి వివరిస్తున్నారు. ఈ విషయం డాక్టర్లు సైతం ధృవీకరించారని అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. తమలపాకు, చీనీ ధరలు సరేసరి. ఇప్పటికే కొంత విస్తీర్ణంలో అంజూర, సపోట వంటి పంటలు సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా లాభసాటి వ్యవసాయంవైపే ఈయన మొగ్గ చూపుతున్నారు. ఈ ప్రాంతంలో గతంలో బొప్పాయి, ఖర్బూజ, అంజూర, ఇతర పంటలు సాగు చేశారు. కొత్తరకం పంటల సా




రత్నచూడు రకం వరి

గుతో ఆశాజనక దిగుబడులు సాధిస్తూ మిగతా రైతులకు ఆదర్శప్రాయుడిగా నిలుస్తున్నాడు.

వరి సాగులో రసాయనిక మందులు వాడను

మొక్కుబడిగా వ్యవసాయం చేయడం నాకు నచ్చదు. కొత్త వరి వంగడాల సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకానికి నేను దూరం. జనుము, జీలుగ మాత్రమే పచ్చిరొట్ట ఎరువుగా వాడతాను. ఆవు మూత్రంను వినియోగిస్తాను. పంటలకైన పెట్టుబడులు బాగా తగ్గిస్తాను. ప్రకృతి వ్యవసాయం అంటే నాకు ఇష్టం. లాభదాయక పంటల సాగుపై మొగ్గుచూపుతాను.



బండి చలపతి, రాంసాయినగర్, దువ్వూరు మండలం



లక్ష్మీపేటలో పింఛన్లు తనఖీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

బోగస్ పింఛన్ల ఏరివేతకు రంగం సిద్ధం



● దివ్యాంగ పింఛన్లపైనే అనుమానాలు ● ఇప్పటికే వేయికి పైగా గుర్తింపు ● వృద్ధాప్య పింఛన్లపై కూడా..

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో బినామీలు పొందుతున్న బోగస్ పింఛన్ల ఏరివేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఈ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టు కింద చాపాడు మండలంలోని లక్ష్మీపేటలో మొదలు పెట్టడం జరిగింది. సోమవారం చేపట్టిన విచారణలో 380 మంది లబ్ధిదారులు అందుబాటులో ఉండగా... 20 మంది అందుబాటులో లేరని తెలుస్తోంది. అధికారులు తనిఖీ చేసిన పింఛన్‌లలో ఎంత మంది అర్హులు అనేది అధికారులు చెప్పడం లేదు. నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తామని విచారణ అధికారులు పేర్కొన్నారు. రెండవ రోజు మంగళవారం మిగిలిన 20 పింఛన్లకు సంబంధించి విచారణ చేపట్టగా.. నలుగురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకార నిక్కచ్చిగా సర్వే నిర్వహిస్తే .. పెద్దఎత్తున పింఛన్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నాయి. నిరుపేదల మాటున చాలా మంది అనర్హులు పింఛన్ పొందుతున్న సందర్భాలు ఉన్నాయి. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వంలో వేల సంఖ్యలో పింఛన్లు పెరిగిపోవడం చూస్తే పింఛన్ల లబ్ధిదారుల అర్హతలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో లబ్ధిదారుల ఆస్తులను అంచనా వేయడం కష్టతరంగా మారుతోందని తెలుస్తోంది. చాలా మంది తమ ఆస్తులను గోప్యంగా ఉంచి పింఛన్లు పొందుతున్నట్లు తెలుస్తోంది.

దివ్యాంగ పింఛన్లపైనే అనుమానాలు...

గత ప్రభుత్వ హయాంలో వికలత్వపు పింఛన్లు భారీగా పెరిగాయి. పింఛన్ల కోసం మాయరోగాన్ని సృష్టించుకొని కొంతమంది ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. వీటిపై భారీ స్థాయిలో ఆరోపణలు రావడంతో 1087 బోగస్ సదరం సర్టిఫికెట్లను ఆగస్టు నెలలో వైద్యాధికారులు గుర్తించారు. జిల్లాలో వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు ఇతర జిల్లాలలో ఉన్న ఆసుపత్రుల ద్వారా సర్టిఫికెట్లు పొందినట్లు గుర్తించారు. ఈ క్రమంలో మరిన్ని పింఛన్లలో అర్హులు ఎంతమంది ఉన్నారని దానిపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఇదే అంశంపై గురువారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిపై జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్చించారు. రాష్ట్రంలో వివిధ సామాజిక పింఛన్లు అర్హులకు అందేలా, అనర్హులను తొలగించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా వికలత్వపు ధ్రువీకరణ కోసం సాంకేతిక, హైబ్రిడ్ విధానాలను వినియోగించి ఫిజికల్ వెరిఫికేషన్‌తో అనర్హులను తొలగించాలని సూచించారు. అదేవిధంగా వికలాంగులకు జారీ చేసే సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలను పూర్తిగా నివారించాలన్నారు. సర్టిఫికెట్లు జారీచేసే డాక్టర్లు మెడికల్ బోర్డు మార్గదర్శకాలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సదరం సర్టిఫికెట్ల జారీలో మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు.

వృద్ధాప్య పింఛన్లపై కూడా...

వృద్ధాప్య పింఛన్లు వయసు ఆధారితంగా మంజూరు అవుతున్నాయి. ఈ క్రమంలో వాస్తవంగా తక్కువ వయస్సు ఉన్నప్పటికి ఆధార్‌కార్డులో వయస్సు పెంచుకొని పింఛన్లు పొందుతున్న వారు కూడా జిలల్లాలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నిజమైన అర్హులు పింఛన్ పొందే అవకాశాన్ని కోల్పోతున్న పరిస్థితి. ప్రస్తుతం జిల్లాలో గత నెలలో 1,34,717 మందికి వృద్ధాప్య పింఛన్లు, 37,785 మందికి వికలత్వపు పింఛన్లు, 940 మందికి పూర్తి వికలత్వపు పింఛన్లు, 58410 మందికి వితంతు పింఛన్లు, 3836 మంది ఒంటరి మహిళల కింద పింఛన్లను పంపిణీ చేశారు. ప్రధానంగా ప్రభుత్వం వీటిపైనే దృష్టి సారించనుంది. వికలత్వ పింఛన్లలో అధికభాగం వినికిడి లోపం మానసిక వికలత్వం సర్టిఫికెట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు విచారిస్తే పింఛన్ల జాబితా నుంచి ఎక్కువ సంఖ్యలోనే అనర్హులు దొరికిపోయే అవకాశాలు కూడా లేకపోలేదు.

20,24 తేదీలలో అంతర్ కళాశాలల యోగా, ఖోఖో క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల యోగా, ఖోఖో క్రీడా పోటీలు వైవీయూ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 20న యోగా, 24న ఖోఖో పోటీలు స్త్రీ, పురుషులకు ఉంటాయన్నారు. ఈ క్రీడలలో పాల్గొనే ఆసక్తిగల విద్యార్థులు 2024 జూలై 1వ తేదీ నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు కలిగి, విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో చదువుతూ ఉండాలన్నారు. విద్యార్థులు స్టడీ, టెన్త్ మార్క్స్‌మెమో, ఇంటర్మీడియట్ మార్క్స్ మెమో ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9705459052, 7997047676 నెంబర్లను సంప్రదించాలన్నారు.

22న సన్నపురెడ్డికి కేతు స్మారక జీవిత సాఫల్య పురస్కారం

కడప కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాసి ప్రముఖ కథా నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి ఈనెల 22వ తేదీ ఆదివారం నగర సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, స్వర్గీయ కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవిత సాఫల్య పురస్కారం అందించనున్నట్లు కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి వెల్లడించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి సుమారు 80 కథలు, 7 నవలలు రాశారన్నారు. ఆయన రాసిన చాలా కథలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదమయ్యాయన్నారు. ప్రధానంగా ఆయన రాసిన మొదటి కాడి అనే నవల అమెరికా వారి తానా నవలల పోటీలో బహుమతి దక్కించుకుందన్నారు. కొండపొలం అనే నవల అదే పేరుతో సినిమాగా కూడా రూపొందిన సంగతి తెలిసిందే అన్నారు. కాగా, తమ కుమార్తె కవిత స్మారకార్థం గత 2010లో సంస్థను ఏర్పాటు చేసి పలు సాహిత్య, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి యేడాది వివిధ ప్రక్రియలలో రచయితలకు పురస్కారాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. గత యేడాది మన జిల్లా వాసి ప్రసిద్ధ రచయిత కేతు విశ్వనాథరెడ్డి స్వర్గస్థులైన నేపథ్యంలో ఆయన స్మారకార్థం కేతు స్మారక జీవిత సాఫల్య పురస్కారం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమానికి కవులు, రచయితలు హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

లారీ, బైకు ఢీ...ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలంలో లారీని ఢీకొన్న బైకు

ముద్దనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప తాడిపత్రి జాతీయ రహదారిలోని గంగాదేవిపల్లె వద్ద శుక్రవారం లారీ, బైకు ఢీ కొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి.

స్థానికుల సమాచారం మేరకు.. తాడిపత్రి వైపు నుంచి ముద్దనూరు వైపు లారీ వెలుతుండగా గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున(30), రామచంద్ర(31)లు బైకు పై గ్రామంలో నుంచి వచ్చి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వెంటనే 108లో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు తరలించినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

రామసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు-ఈడిగపల్లె మార్గంలో గల నల్లచిన్నేపల్లె క్రాస్ వద్ద గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పుంగనూరు మండలం, నేతిగుట్లపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ(66) తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వస్తూ ఉండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఇతనిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటరమణ వెంకటరమణ గురువారం మృతి చెందాడు. అతని కుమారుడు మహేష్ ఫిర్యాదుపై ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుపై విరిగిపడ్డ చింతచెట్టు తప్పిన ప్రమాదం



రామసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం-చెంబకూరు రోడ్డు మార్గంలోని శనేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం చింతచెట్టు విరిగిపడింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనదారులు ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వంద ఏళ్లనాటి వృక్షం కావడం.... గత వారం రోజులుగా వర్షం పడుతుండటంతో మహావృక్షం చెట్టు కూలిపోయి రోడుపైకి వాలింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని చెట్టు కొమ్మలను తొలగించి వాహనాలు రాకపోకలు పునరుద్ధరించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రాయచోటిటౌన్/ ఖాజీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లోని పలు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడప విజిలెన్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, వ్యవసాయ అధికారులతో కలిసి కడప జిల్లాలోని ఖాజీపేట మండల కేంద్రంలో గల శ్రీలక్ష్మి గణేశ్ ట్రేడర్స్, శ్రీవెంకటేశ్వర రైతు ఏజెన్సీలతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని పీలేరు మండల కేంద్రంలో గల శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీ శ్రీనివాస ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తూకాల్లో తేడాలు, రికార్డుల్లో స్టాక్ వ్యత్యాసాలు, అధిక ధరలు అమ్మడం వంటివి గుర్తించారు. ఇందులో భాగంగానే మెట్రాలజీ యాక్ట్ అండ్ రూల్స్ 2009, 2011 ప్రకారం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ద్వారా రూ.1.50 లక్షలతో పాటు జీఎస్టీ యాక్ట్ ప్రకారం రూ.50వేలు జరిమానా విధించారు. అలాగే ఎఫ్‌ఏసీ 1985, అర్బన్ సీ 28(1)(డీ) ప్రకారం వ్యవసాయ అధికారుల ద్వారా రికార్డుల్లో స్టాక్ వ్యత్యాసాలు ఉండడం వలన 23.25 మెట్రిక్ టన్నుల ఎరువులకు (రూ.4,75,370 విలువ గల) స్టాప్ సేల్స్ నోటీసులు జారీ చేశారు. స్టాక్ రికార్డులు స్వల్ప తేడాలు ఉన్నందునపై దుకాణ యజమానులకు అమ్మకం, నిలుపుదల నోటీసులు ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగుణంగా ఎరువులను, విత్తనాలను, పురుగు మందులను రైతులకు విక్రయించాలని, లేనిచో చర్యలు తప్పవని కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావుతో పాటు విజిలెన్స్ అధికారులు ఏవీ జవహర్‌రెడ్డి, డీఈఈ బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ విజయ్‌కిశోర్, ఏఈఈలు అశోక్‌కుమార్, ఖాజాహుస్సేన్, డీసీటీవోలు బాబు మోజెస్, రమేశ్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఖాజీపేట వ్యవసాయ అధికారి నాగార్జున, పీలేరు వ్యవసాయ అధికారిణి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఖాజీపేటలోని ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మానవీయ విలువలతో కూడిన విద్య అవసరం

● వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ



సావనీర్ విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మానవీయ విలువలతో కూడిన విద్య అవసరమని వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ తెలిపారు. శుక్రవార కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంపవరింగ్ యూత్ రోల్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్ అండ్ ప్రొఫెషనల్ ఎథిక్స్ ఫర్ బెటర్‌టుమారో అనే అంశంపై ఒక్కరోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మానవీయ విలువలు చాలా అవసరమని.. విలువలతో కూడుకున్న విద్యను కలిగి ఉన్నపుడే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులంతా తమ గురువులు చెప్పిన జ్ఞానాన్ని విలువలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. అమెరికా మిసిసిపి యూనివర్సిటీ నుంచి ఆన్‌లైన్ ద్వారా డాక్టర్ కల్లూరు రాజమోహన్ మాట్లాడుతూ యువత కృషి పట్టుదల క్రమశిక్షణ కలిగి ఉన్నట్లయితే తాము అనుకున్న లక్ష్యాలను సకాలంలో సాధించడానికి వీలవుతుందన్నారు. అనంతరం ఆధ్యాత్మిక గురువు వరదానంద, ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాష, విశ్రాంత ప్రొఫెసర్ సత్తార్, వైవీయూ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, ప్రొఫెసర్ వినోదిని ప్రసంగించారు. అనంతరం అతిథులు సావనీర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ సుజాత, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ కోఆర్డినేటర్‌గా సునీత

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైవీయూ భూగర్భశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వి.సునీతను యూనివర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్‌గా, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (ఆర్‌టీఐ)గా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అందజేశారు. ఈ స్థానంలో పనిచేస్తున్న కోఆర్డినేటర్ ఆచార్య గంగిరెడ్డి, పీఐఆర్‌టీఐపీఐఓపీ శివారెడ్డి పదవీకాలం పూర్తికావడంతో రిలీవ్ అయ్యారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం రామిరెడ్డిలేవుట్‌లో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.25,750 నగదును స్వాధీనం చేసుకొని.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు జూనియర్ కళాశాలలకు సెలవు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండో శనివారం సందర్భంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలకు సెలవు దినంగా ప్రకటించడమైందని ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడైన జూనియర్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తే ఇంటర్‌మీడియట్ బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం సమావేశం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఆర్ఐఎస్ జూనియర్ కళాశాలలో ఈనెల 15వ తేదీ ఉదయం 10గంటలకు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యం సమావేశం నర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.నరసింహులు ఒక ప్రకటనల తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు హాజరు కావాలని కోరారు.

వృద్ధులపై యువకుడి వీరంగం...!

● ముగ్గురికి తీవ్ర రక్తగాయాలు

గుర్రంకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించి ఆరుగురు వృద్ధులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మర్రిమాకులపల్లెలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, బాధితుల వివరాల మేరకు మండలంలోని మర్రిమాకులపల్లెకు చెందిన జయరామిరెడ్డి కుమారుడు దిలీప్‌కుమార్‌రెడ్డి(25) చెడువ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో ప్రతి రోజు మద్యం సేవించి గ్రామంలో గొడవలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రచ్చబండ వద్ద కూర్చొని ఉన్న వృద్ధులపై మద్యం మత్తులో కర్రతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో రామలక్ష్మమ్మ(75), లక్ష్మమ్మ(80), హేమవతమ్మ(60)లకు కాళ్లు విరిగాయి. అలాగే ఈశ్వరమ్మ(50), ఎస్.లక్ష్మమ్మ(65), కత్తి లక్ష్మక్క(55)లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గాయపడిన వృద్ధులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడడంతో కాళ్లు విరిగిన వృద్ధులను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. యువకుడి వీరంగంతో గ్రామంలో ప్రజలు భయాందోళలనకు లోనయ్యారు. ఈవిషయాన్ని పోలీసులకు తెలపడంతో ఎస్ఐ రామచంద్రుడు యువకుడిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలు ఆపాలి

● యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్

రాయచోటిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపడంతో పాటు ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట నేషనల్ కోఆర్డినేటర్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు అడుగులు వేస్తున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ మీటర్లను అమర్చడం అందులోని భాగమేనన్నారు. ఇదే పరిస్థితి భవిష్యత్‌లో కొనసాగితే అటు రైతులకు, ఇటు సామాన్య ప్రజలకు, సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మిక వర్గానికి చాలా నష్టం జరుగుతుందన్నారు. డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్థను ప్రైవేట్ వారికి అప్పజెప్పే ప్రయత్నం ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు.

ఎట్టకేలకు అటవీ అనుమతులు

● పునః ప్రారంభం కానున్న కమలాపురం బ్రిడ్జి పనులు

అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు



కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి హైవేపై కమలాపురం వద్ద నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులకు ఎట్టకేలకు అటవీ అనుమతులు లభించాయి. సుమారు మూడేళ్ల కిందట వచ్చిన వర్షాలతో కమలాపురం సమీప పాపాఘ్ని నదిపై వంతెన కుంగిపోయింది. దీంతో కొన్ని నెలలు పాటు రాకపోకలు ఆగిపోయాయి. వాహనాలు తిరిగే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో అధికారులు కుంగిన బ్రిడ్జిపైన కేవలం మనుషులు నడిచేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కొన్ని నెలలు పాటు ప్రజలు అవస్థలు పడ్డారు. ఎర్రగుంట్ల ప్రాంతంలో సిమెంటు, నాపరాయి పరిశ్రమలు ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డులో తిరిగేవి. అయితే బ్రిడ్జి కూలిపోవడంతో వాహనాల రాకపో కలకు అంతరాయం జరిగింది. కొన్ని నెలల తర్వాత నదిలో నీరు తగ్గడంతో అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. మరి కొంతకాలానికి అప్పటి ప్రభుత్వం నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంది. టెండర్లు నిర్వహించి బ్రిడ్జి పనులు చేపట్టారు. అయితే బ్రిడ్జి నిర్మాణం రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో చేపట్టడంతో అటవీ అధికారులు పనులను నిలుపుదల చేయించారు. ఫలితంగా బ్రిడ్జి పనులు అర్థంతరంగా ఆగిపోయాయి. ఏళ్ల తరబడి అప్రోచ్ రోడ్డు వాహనాల రాకపోకలకు దిక్కు యింది. పనులు చేపట్టే ముందు సర్వే నిర్వహించి స్థల సేకరణలో బ్రేక్ పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం ఈనెల చివరి నాటికి బ్రిడ్జి పనులు పూర్తి కావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా బ్రిడ్జి నిర్మాణానికి అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారు. కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి వుండ డంతో కొంతవరకు జాప్యం ఏర్పడింది.

పుత్తా చొరవతో...

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కమలాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయన బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగి పోయి ప్రజలు అవస్థలు పడుతుండటం గమ నించి... ప్రభుత్వ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసు కొచ్చి పనులు పునఃప్రారంభించేందుకు ప్రయత్నిం చారు. దీంతో పాటు ఆయన తండ్రి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరగా అటవీ అనుమతులు వచ్చేందుకు చొరవ చూపారు. దీంతో ఎట్టకేలకు అనుమతులు లభించాయి. మరికొన్ని రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాలున్నాయి. దీంతో బ్రిడ్జికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తయి రాకపోకలు కొనసాగే అవకాశాలున్నాయి.

బ్రిడ్జి పనులకు అనుమతులు వచ్చాయి

కమలాపురం రిజర్వు ఫారెస్ట్ పరిధిలో కమలాపురం సమీపంలోని నిర్మిస్తున్న బ్రిడ్జికి సంబంధించి అటవీ అనుమతులు లభించాయి. మరికొన్ని రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి.

- దివాకర్, ఇన్‌చార్జి జిల్లా అటవీశాఖ అధికారి.

వానొస్తే.. బురదమయం



బురదమయమైన మార్కెట్ యార్డు ప్రాంగణం



రొచ్చుగా మారిన ప్రభుత్వాస్పత్రికి వెళ్లే రోడ్డు

● అటు వెళ్లాలంటే హడలిపోతున్న జనం ● ఇదీ మండల కేంద్రమైన ములకలచెరువు దుస్థితి

ములకలచెరువు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వానొస్తే చాలు మండల కేంద్రమైన ములకలచెరువు బురదమయమవుతోంది. వర్షం పడినప్పుడల్లా రహదారులు రొచ్చుగా మయంగా మారుతోంది. దీంతో అటు వైపు వెళ్లాలంటేనే జనం హడలిపోతున్నారు. తుఫాను కారణంగా కురిసిన వర్షానికి ములకలచెరువులోని మార్కెట్‌యార్డు, ఆర్టీసీ బస్టాండు, నాయనిచెరువుపల్లె రోడ్డు, ప్రభుత్వాస్పత్రి రోడ్డులో రాకపోకలు సాగించడానికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తుండడంతో కాలినడక సాగించడానికి కూడా వీలు లేకుండా పోతోంది. అలాగే వక్కటగుట్ట కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలుస్తుండడంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించడానికి పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మండల కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడం దారుణమని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్‌యార్డు, ఆర్టీసీ బస్టాండు, ప్రభుత్వాస్పత్రి రోడ్డు తదితర చోట్ల సీసీ రోడ్లు నిర్మించి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.



రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు



నాయనిచెరువుపల్లె రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ముఖాముఖి



ప్రసాద్‌బాబు
సీఐ, వాల్మీకిపురం

వాల్మీకిపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. బంగారు భవిష్యత్ కాపాడుకోవాల్సిన యువత మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన హితవుపలికారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతామంటూ శుక్రవా రం ఇంటర్వ్యూలో పలు వివరాలను సీఐ వెల్లడించారు.

ప్రశ్న: గంజాయి మాదక ద్రవ్యాల అణచివేతపై మీ చర్యలు ఏంటి..?

జవాబు: గంజాయితో యువత జీవితాలను నాశనం చేసుకోరాదు. ముఖ్యంగా విద్యార్థులు వారి భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా పిల్లల తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రశ్న: అక్రమ మద్యం రవాణా, నాటు సారాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: బయటి ప్రాంతాల నుంచి అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాం. ఈ విషయంలో ఎంతటివారైనా ఉపేక్షించం.

ప్రశ్న: చోరీల నివారణకు మీ చర్యలేంటి?

జవాబు: రాత్రి పూట గస్తీలు ముమ్మరం చేయడం. వాహనాల తనిఖీ, అనుమానితులపై నిఘా చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నాం. ఇటీవల ద్విచక్ర వాహనాల చోరీ విషయంలో 37 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: రోడ్డు భద్రతపై ఎలాంటి చర్యలు చేపట్టారు ?

జవాబు: రోడ్డు భద్రత విషయంలో వాహన చోదకులు తప్పనిసరిగా లైసెన్సు, వాహన రికార్డులు కలిగి ఉండాలి. విధిగా వాహన చోదకులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలి. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవు.

ప్రశ్న: మైనర్లకు వాహనాలివ్వడంపై చర్యలేంటి?

జవాబు: మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం. పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇచ్చి పంపడం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే దానికి పూర్తిగా తల్లిదండ్రులే బాధ్యులవుతారని హెచ్చరిస్తున్నాం.

జాబ్ మేళాలో ఆరుగురికి ఉద్యోగాలు

తంబళ్లపల్లె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళా ఆరు మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ మేళాకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీయువకులు హాజరయ్యారు. వారికి చిత్తూరు అమర్ రాజా కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన 6 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐటీఐ ట్రైనింగ్ అధికారి నాగరాజు మాట్లాడుతూ...ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ చౌడయ్య, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు సురేంద్ర, అశోక్, వెంకట్రమణ, రెడ్డి వరప్రసాద్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలకు మందులు పంపిణీ

తంబళ్లపల్లె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాలల్లోని పశు వైద్యశాలలకు ప్రభుత్వం నుంచి వచ్చిన మందులను పశు వైద్యాధికారులు పంపిణీ చేశారు. శుక్రవారం తంబళ్లపల్లె పశు వైద్యకేంద్రంలో ఏడీ సుమిత్ర ఆధ్వర్యంలో తంబళ్లపల్లె మండలంలో 7, పెద్దమండ్యం మండలంలోని 3 పశు వైద్యశాలలకు మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

వాల్మీకిపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని ధర్మపథంలో శుక్రవారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకం, హోమాలు, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వాములకు విశేష భక్తజనం నడుమ కల్యాణోత్సవ వేడుకలు కమనీయంగా సాగాయి. ఆలయంలో భక్తులకు తీర్థ, ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై గ్రామాల్లో అవగాహన పెంచాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో సుజాత

మదనపల్లె టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలను అరికట్టడం, యువత చెడుమార్గాల్లో పయనించకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు అవగాహన కల్పించాలని సీడీపీవో సుజాత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కిశోరి వికాసం అమలుపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్యవివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎంపీడీవో తాజ్‌మస్రూర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను మహిళా పోలీస్, ఏఎన్ఎం, వెల్ఫేర్ సెక్రటరిలో సమిష్టిగా పనిచేస్తూ బాల్యవివాహాల అడ్డుకోవడంలో ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ స్వాతి మాట్లాడుతూ బడి మానేసిన పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాలూకా ఎస్ఐ హరిహరప్రసాద్, పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, ఎంఎస్‌కేలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ సెక్రటరిలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి తెలియజేసేందుకే కిశోరివికాసం కార్యక్రమం చేడుతున్నట్లు బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో భాగ్యమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కిశోరివికాసం మండలస్థాయి శిక్షణ సమావేశంలో పౌష్టికాహారం, బాల్యవివాహాలు, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్, రక్తహీనత తదితర విషయాలపై అవగాహన కల్పించాలని వివరించారు. ఏపీఎం రాజేశ్వరి, ఎంయల్‌హెచ్‌పీ స్వాతి, పీసీ రవీంద్రనాయక్, సూపర్‌వైజర్లు హిజాద్‌ప్యారీ, భవాని, గౌరీదేవి అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌డీపీఎల్ కేసుల పరిష్కారానికి చర్యలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎల్, డీపీఎల్ కేసుల్లో పట్టుబడిన వారు లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సీఐ విలేకర్లతో మాట్లాడుతూ కర్ణాటక మద్యం తరలిస్తూ, విక్రయిస్తూ పట్టుబడిన కేసుల్లో నిందితులు కేసుల పరిష్కారం కోసం ఈనెల 14వ తేది మదనపల్లె కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్‌డీపీఎల్(కర్ణాటక మద్యం) కేసుల్లో పట్టుబడిన మద్యం విలువకు ఐదు రెట్లు జరిమానా చెల్లించాలని, డీపీఎల్(ఆంధ్ర మద్యం) కేసుల్లో పట్టుబడిన మద్యం విలువలో మూడు రెట్లు జరిమానా చెల్లించాలన్నారు. కోర్టులో జరిమానా చెల్లించిన వారిపై కేసు కొట్టివేస్తారన్నారు. తొలిసారిగా ఎన్‌డీపీఎల్, డీపీఎల్ కేసుల్లో పట్టుబడిన నిందితులకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుందని సీఐ చెప్పారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు సుష్మిత్ పుష్పాలతో అలంకరణ చేసి అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు.. అనంతరం మహిళలు అమ్మవారికి చీర, జాకెట్లు, పొంగళ్లు నైవేద్యం సమర్పించి నెయ్యి ఒత్తులతో దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలివేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కురబలకోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కురబలకోట ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి వికాసంపై వెల్‌ఫేర్ అసిస్టెంట్స్, మహిళా పోలీసులు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చాలా మందికి అవగాహన లేకపోవడం బాల్య వివాహాలను చేస్తున్నారని, అలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలికలకు ఉచిత నిర్బంధ విద్యను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. అలాగే వీరికి పోషణ, ఆరోగ్యం తదితర వాటికి సంబంధించిపై అవగాహన కల్పించాలన్నారు.

గుండ్లూరులో 20 ఎకరాల మేతభూముల ఆక్రమణ

కలికిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరు గ్రామంలో 20 ఎకరాలకు పైబడి మేతబీడు, రస్తా పోరంబోకు భూములు అన్యాక్రాంతమైనట్లు. శుక్రవారం రెవెన్యూ సదస్సులో స్థానికులు అధికారుల దృష్టి కి తెచ్చారు. రూ. కోట్ల విలువ చేసే ఈ భూములను రియల్ ఎస్టేట్‌పరంగా రికార్డులు తారుమారు చేశారని ఇందులో ఆరోపించారు. గుండ్లూరు గ్రామం ఎర్రదొడ్డిపల్లెకు చెందిన మారెళ్ళ శ్యామ్ ప్రసాద్ (స్వామి) ఈ మేరకు అన్యాక్రాంతమైన ప్రజావసరాలకు సంబంధించిన భూముల వివరాలను అధికారులకు వివరించారు. సర్వే నంబర్లు 685లోని 2.54 ఎకరాలు, 690లోని 6.60 ఎకరాలు, 691లోని 8.64 ఎకరాలతోపాటు 703, 688, 779 సర్వే నంబర్లలోని మొత్తం 20 ఎకరాలను గ్రామంలోని రైతుల పశువుల కోసం మేత బీడు, రస్తా కోసం రెవెన్యూ రికార్డుల్లో కేటాయించారని పేర్కొన్నారు. కాగా శుక్రవారం గుండ్లూరు గ్రామ సదస్సులో ఆర్ఓఆర్ రికార్డుల మార్పులకు సంబంధించి 30, సరిహద్దుల కొలతలకు సంబంధించిన 31 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు మహేశ్వరీబాయి తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

నిమ్మనపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న భూ సమస్యలను సత్వరపరిష్కారం కొరకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. శుక్రవారం రాచవేటివారిపల్లి గ్రామ పంచాయతిలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు ఈసందర్భంగా టీడీపీ నేత ఆర్వే వెంకటేష్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పేదల నుంచి దౌర్జన్యంగా భూములు లాక్కొని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో రెవెన్యూ గ్రామ సభల ద్వారా నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని తెలిపారు. రెవెన్యూ గ్రామ సభలో 210వరకు వివిధ అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరయణ, నాయకలు సుధాకర్‌రావు, మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

తంబళ్లపల్లె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ కోసువారిపల్లె రెవెన్యూ సదస్సులో గ్రామస్థులు అధికారులకు అర్జీ అందజేశారు. శుక్రవారం మండలంలోని కోసువారిపల్లె సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై 42 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు హరికుమార్ తెలిపారు. భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని 37 అర్జీలు, సర్వే చేయాలని 2, దారి సమస్య పరిష్కరించాలని 2, కోసువారిపల్లె గ్రామానికి శ్మశానవాటికకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి జోగేంద్ర, దేవదాయశాఖ రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, ఎఫ్‌బీవో రామరాజు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


పెద్దమండ్యంలో: భూ సమస్యల ప్రతి అర్జీ పరిష్కారం జరుగుతుందని పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ పేర్కొన్నారు. మండలం లోని బండ్రేవులో శుక్రవారం జరిగిన రైతు సదస్సులో రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతు సదస్సులో అన్ని సమస్యలపై 81 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బండ్రేవు సర్పంచ్ భారతి, వీఆర్వో రెడ్డిశేఖర, కూటమి నేతలు చల్లపల్లి వేణుగోపాల్‌పెడ్డి, శివారెడ్డి, రమణ, శ్రీనివాసులు, పీరాన్, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బూడిదవేడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల నుంచి వినతులు స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, టీడీపీ మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు కుడుం ఉదయ్‌కుమార్ మృతి

బి.కొత్తకోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు సోదరుడు కుడుం ఉదయ్‌కుమార్ శుక్రవారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఉదయ్‌కుమార్ మృతి చెందిన విషయం తెలియగానే నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు తరలివచ్చి నివాళులర్పించారు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌యాదవ్, ఏవీ లక్ష్మీదేవమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ లతో పాటు మండల కన్వీనర్‌లు నారాయణస్వామిరెడ్డి, ఆనందరెడ్డి, బిల్డర్‌రమణ, సురేంద్రయాదవ్, దేవరింటికుమార్, కశెట్టి వెంకట్రమణ, బంగారు వెంకట్రమణ, కనకంటిప్రసాద్ తదితరులు ఉదయ్‌కుమార్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యూటీఎఫ్ టెన్త్ మోడల్ పరీక్ష పత్రాల ఆవిష్కరణ



మదనపల్లె అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈవో చేతుల మీదుగా శుక్రవారం యూటీఎఫ్‌చే రూపొందించిన ఎస్ఎస్‌సీ మోడల్ పరీక్ష పత్రాలను అవిష్కరించారు. ఈసందర్భంగా ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిష్ణాతులైన సబ్జెక్టు ఉపాధ్యాయులచే ప్రతిఏడాది యూటీఎఫ్ పదో తరగతి పరీక్ష మోడల్ పేపర్లను విద్యార్థులకు అందించడం హర్షణీయమన్నారు. అన్ని సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకం తయారు చేయడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఎంఈవో రాజగోపాల్, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, అసోసియేషన్ అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల సమరానికి సర్వం సిద్ధం

● తంబళ్లపల్లె నియోజకవర్గంలో 38 చెరువులు, పెద్దేరు ప్రాజెక్టుకు ఎన్నికలు
● ఒకే రోజు మెంబర్లు, అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఎన్నిక



తంబళ్లపల్లెలోని పెద్దేరు ప్రాజెక్టు

ములకలచెరువు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో శనివారం సాగునీటి సంఘాల సమరానికి అధి కారులు సర్వం సిద్ధం చేశారు. నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 38 చెరువులు, పెద్దేరు ప్రాజెక్టుకు ఎన్నికలు జరగనున్నాయి. టీసీ మెంబర్లు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నిక ఒకే రోజు జరగనుంది. ఆయా చెరువులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 11వతేదీన అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికలు జరుగుతున్న చెరువుల పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉంటారు. ఉదయం 8గంటల నుంచి 1 గంటలోపు ఒక్కో చెరువుకు ఆరుగురు టీసీ సభ్యుల ఎన్నిక జరుగుతుంది. ఆయకట్టు రైతులందరూ సమావేశమై చేతులెత్తే పద్ధతిలో సభ్యులను ఎన్నుకుంటారు. పోటీ ఉంటే రహస్య ఓటింగ్ ద్వారా టీసీ సభ్యుల ఎన్నిక జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికైన ఆరు గురు టీసీ మెంబర్లలో ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియతో ఎన్నికలు ముగుస్తాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపలె మండలంలో 11(పెద్దేరు ప్రాజెక్టుతో కలిపి), ములకలచెరువు మండలంలో 8, పెద్దతిప్పసముద్రం మండలంలో ఏడు, పెద్దమండ్యం మండలంలో ఆరు, బి.కొత్తకోట మండలంలో ఐదు, కురబలకోట మండలంలో రెండు చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈలు శ్రీనివాసులు, సతీష్‌కుమార్‌లు తెలిపారు.

పీలేరులో మూడు చెరువులు, 852 మంది ఓటర్లు

పీలేరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలంలో మూడు చెరువులకు సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. వాటిలో పీలేరు పట్టణంలోని అయ్యప్పనాయుని చెరువు, దొడ్డిపల్లె పంచాయతీలోని చింతల చెరువు, గూడరేవుపల్లెలోని సూరప్ప చెరువుల ఉన్నాయి. అయ్యప్పనాయుని చెరువు పరిధిలో ఆరు టెరిటోరియల్ కాన్సిట్యూయెన్సీ(టీసీ)లలో 371 మంది ఓటర్లు ఉన్నారు. చింతల చెరువు పరిధిలో ఆరు టీసీలలో 270 మంది ఓటర్లు ఉన్నారు. సూరప్ప చెరువు పరిధిలో ఆరు టీసీలలో 211 మంది ఓటర్లు ఉన్నారు. వెరసి మూడు చెరువుల్లో 18 టీసీలలో 852 మంది ఓటర్లు ఎన్నికలలో పాల్గొననున్నారు. ఎన్నికలు సజావుగా, నిస్పక్షపాతంగా నిర్వహించేందుకు తహసీల్దారు భీమేశ్వర రావు, పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో చెరువుకు 14 మంది సిబ్బందిని నియమించారు. వారందరూ శనివారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు ఆయా సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు పూర్తి చేయనున్నారు. అయ్యప్పనాయుని చెరువుకు కోటపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, చింతల చెరువుకు శివరామాపురంలోని గ్రామ సచివాలయం, సూరప్ప చెరువుకు గూడరేవుపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు తెలిపారు.

రైతులు కోల్పోయిన భూములను తిరిగి ఇప్పిస్తా

● టీడీపీ రాష్ట్రకార్యదర్శి కొండ్రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా కార్యదర్శి కొండ్రెడ్డి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):పేద రైతులు కోల్పోయిన భూములను తిరిగి ఇప్పిస్తానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ కురబలకోట మం డలం అంగళ్లు గ్రామంలో గత ఐదే ళ్ల పాలనలలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అండదండలు చూసుకుని కొంతమంది వైసీపీ నాయకులు పేదల భూములను ఆక్రమించేసి అమ్మేశారని ఆరోపించారు. అప్పట్లో పేదలను భయాందోళనలకు గురిచేశారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అంగళ్లు పరిసరప్రాంతాల్లో జరిగిన భూఆక్రమణలు, దౌర్జన్యాలు, భూ కుంభకోణాలపై కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించాలని అయన డిమాండ్ చేశారు. ఈ భూ కుంబకోణాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్లుతున్నట్లు పేర్కొన్నారు. బాధితులకు అండగా ఉంటూ వారి కోల్పోని భూములను వారికి ఇప్పించే వరకు పోరాటం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో భూబాధితులు రవి, ఆంజనేయులు,మునిస్వామిరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రరెడ్డి, నాగభూషణం, మాజీ సర్పంచులు ఎంవీ మోహన, రమణప్ప పాల్గొన్నారు.

వార్డు సచివాలయ నిర్వహణ లోపభూయిష్టం


● సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా ● ఎమ్మెల్యే తనిఖీలో బట్టబయలు



దొంతివీధి సచివాలయంలో సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అన్ని రకాల సేవలు అందించడానికి నెలకొల్పిన సచివాలయాల నిర్వహణ లోపభూయిష్టంగా మారిందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడం, ఎలాంటి అనుమతి లేకుండా గైర్హాజరు అయిన ఘటన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తనిఖీలో బట్టబయలు అయ్యింది. శుక్రవారం మదనపల్లె పట్టణం దొంతివీధిలోని వార్డు సచివాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ విధులు నిర్వహించాల్సిన సిబ్బంది ఎలాంటి లీవు లెటర్ పెట్టకుండా డుమ్మా కొట్టారు. ఒకరిద్దరు హాజరైనా మిగిలిన వారు క్షేత్రస్థాయిలో విధులకు హాజరైతున్నట్లు చెప్పారే కాని మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయలేదు. దీనిపై అక్కడి ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధ్యతగా పనిచేయాల్సిన సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు డుమ్మా కొట్టిన సిబ్బందికి మెమోలు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. వీరిపై విచారణ నిర్వహించి ఎందుకు సస్పెండ్ చేయకూడదో సంజాయిషి కోరాలని కమిషనర్‌కు సూచించారు. అనంతరం ఇందిరానగర్‌లో మసీదు వద్ద కాలువపై రూ.2లక్షలతో కల్వర్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

జర్నలిస్టులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఏపీడీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొన్న హైదరాబాద్‌లో జర్నలిస్టుపై సినీనటుడు మోహన్‌బాబు దాడి చేయగా, నిన్న కడప జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు జర్నలిస్టులపై దాడులు జరగడం శోచనీయమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు అక్కులప్ప, వంశీధర్, రమేష్, శ్రీనివాసగౌడ, శివారెడ్డి, కిరణ్, శ్రీధర్‌బాబు, విజయ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయురాలికి రాష్ట్రస్థాయి అవార్డు



రాష్ట్రస్థాయి అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయురాలు నిర్మలమ్మ

కురబలకోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు సమీపంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు నిర్మలమ్మ రాష్ట్రస్థాయిలో ఉత్తమ తెలుగు భాషా ఉపాధ్యాఉరాలు అవార్డును దక్కించుకున్నారు.. హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలలో భాగంగా మండలంలోని ముదివేడు సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న నిర్మలమ్మ అవార్డును సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ఆంగ్ల ప్రొఫెసర్ మాధవిరెడ్డి తదితరుల చేతుల మీదగా అందుకున్నారు. కాగా తెలుగు భాషా అభివృద్ధికి విశేషంగా కృషి చేయడంతో పాటుగా తెలుగు భాషపై విద్యార్థులలో ఆసక్తి చూపించడంలో ఆమె చేసిన కృషికి అవార్డును అందజేశారు. అలాగే పాఠశాలలో 8వ తరగతికి చెందిన అంజలీ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం, 9వ తరగతికి ప్రణవ్య జిల్లాస్థాయిలో ప్రతిభ కరనబరచడంతో ప్రతిభా అవార్డులను అందజేశారు. వారిని ఎంఈవో ద్వారకనాథ్ తదితరులు అభినందించారు.